### అమ్మ పేరుతో మొక్క నాటండి..

ఢిల్లీ: వాతావరణ మార్పులపై పోరాటానికి, భవిష్యత్ తరాల పరిరక్షణకు మొక్కలు నాటడమే శరణ్యమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగా భారతీయ పౌరులందరూ తమ తల్లి పేరుతో ఒక్కో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం న్యూఢిల్లీ జంతర్ మంతర్‌లోని తన అధికారిక నివాసంలో బండి సంజయ్ మొక్కలు నాటారు. తన కార్యాలయ సిబ్బందితో కూడా మొక్కలు నాటించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మొక్కల పెంపకం ద్వారా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు బండి సంజయ్ కుమార్. వాతావరణ మార్పులపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ కుమార్ అన్నారు


ప్రభాత

www.suryaa.news

# సూర్య

తెలుగు జాతీయ దిన పత్రిక

వేల రూ.5/ - పేజీలు : 8 శుక్రవారం 6 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 33



విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news



PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## ఛత్తీస్ గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్

- మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతి
- బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్
- మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ హతం
- సుధాకర్ తలపై రూ. కోటి రివార్డు
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో మోస్ట్ వాంటెడ్



## సామాన్యుల ప్రాణాలంటే వారికి విలువ లేదు

- బెంగళూరు ఘటనపై మరోసారి స్పందించిన భాజపా
- అధికారంలోని కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
- "చిన్నస్వామి స్టేడియం వద్ద ఘోరం జరిగింది
- ఈ ఘటనపై యావత్ దేశం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది

# ఉద్యోగులకు రెండు డీఏలు

- వెంటనే ఒకటి.. ఆర్నెల్ల తర్వాత మరొకటి
- నెలకు రూ. 700 కోట్ల చొప్పున బకాయిల చెల్లింపు
- ఉద్యోగి భాగస్వామ్య చెల్లింపుతో వైద్య చికిత్సలు
- సీఎస్ ఛైర్మన్‌గా ప్రత్యేక ట్రస్ట్
- మహిళా సంఘాల సభ్యులు మృతిచెందితే రూ. 10 లక్షలు
- హ్యామ్ విధానంలో రోడ్లకు పచ్చజెండా
- మెట్రో రెండోదశ విస్తరణకు ఆమోదం
- మంత్రిమండలి భేటీలో కీలక నిర్ణయాలు



హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మంత్రిమండలి శుభవార్త చెప్పింది. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో రెండింటిని చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్య ట్రస్టు ఏర్పాటు చేయడానికి నిర్ణయంతీసుకుంది. ప్రతి నెలా రూ.700 కోట్ల చొప్పున ఉద్యోగుల బకాయిలు చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. స్వయం సహాయక బృందాల్లోని సభ్యులు చనిపోతే.. వారి కుటుంబాలకు నేరుగా ప్రభుత్వమే - మిగతా2లో



## రూ.1 తయారీకి.. రూ.1.11 వ్యయం

- తడిసి మోపెడవుతున్న కరెన్సీ ముద్రణ ఖర్చు
- 2024-25లో రూ.6,373 కోట్లకు చేరిక
- ఏడాదిలో 25 శాతం పెరిగిన వ్యయం
- చెలామణిలోకి 3,030 కోట్ల నోట్లు

వివరాలు 2లో..

## పహల్గామ్ దాడి బాధితులకు ఇంకా న్యాయం జరగలేదు



- కశ్మీర్‌కు వెళ్లనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకున్నారని జైరామ్ రమేశ్ వ్యాఖ్య
- 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టిన కాంగ్రెస్ సీనియర్ నేత



## నిధుల సేకరణపై దృష్టి సారించాలి

### మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో భట్టి విక్రమార్క ఆదేశం

హైదరాబాద్

ఖజానాకు నిధుల సమీకరణపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఉపసంఘం సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా పలు అంశాలపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు సూచించిన అంశాలు, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించడానికి, పరిశీలించడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. ఉపసంఘం సమావేశం ప్రతివారం ఉంటుందని, ప్రతి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిని తరువాత వచ్చే వారం జరిగే సమావేశంలో అంశాల వారీగా - మిగతా2లో

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



- నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవిపై మాజీ ఎమ్మెల్యే సంపత్ ఫిర్యాదు
- 'నాగర్‌కర్నూలు' సమీక్షలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టికి..
- ఐఏఎస్, ఐపీఎస్‌లు పట్టించుకోవడం లేదన్న మహబూబ్‌నగర్ నేతలు

హైదరాబాద్

అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడును నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవిని ఇంటికి పిలిపించుకొని మాట్లాడాల్సిన అవసరం ఏంటని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో కలిసి ఎంపీ తిరుగుతున్నారంటూ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. గురువారం నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, వరంగల్ - మిగతా2లో

## హైదరాబాద్‌లో రాఫెల్!

- యుద్ధవిమానాల ఫ్యూస్‌లాజ్ తయారీకి
- టాటా సంస్థతో దసో ఒప్పందం
- కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న టీఏఎస్ఎల్
- నెలకు రెండు ఫ్యూస్‌లాజ్‌ల తయారీ లక్ష్యం
- తొలిసారిగా ఫ్రాన్స్ వెలుపల ఉత్పత్తి!

## పేదలను కొట్టి పెద్దలకు భూములు

- పెద్ద ధన్వాడలో రైతులపై కేసులు, అరెస్టులు దుర్మార్గం
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపాటు
- రైతులపై తరచూ ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు దాడులు చేస్తున్నారు




హైదరాబాద్

బీద రైతుల కడుపుకొట్టి వారి భూములను బడా పారిశ్రామికవేత్తలకు కారు చౌకగా కట్టబెట్టడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తనకు నచ్చిన బడాబాబుల కోసం 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ భూములను బలవంతంగా సేకరించే బాధ్యతను సీఎం భుజాన వేసుకున్నారని ఆరోపించారు. దీంతో రైతులపై తరచూ ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు దాడులు - మిగతా2లో



## బెంగళూరు నగర పోలీస్ కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు

- సీఎం సిద్ధరామయ్య కీలక ఆదేశాలు
- బెంగళూరు పోలీస్ కమిషనర్ సహా ఐదుగురు సీనియర్ అధికారుల సస్పెన్షన్
- ఘటనపై సీఐడీ దర్యాప్తునకు, జ్యుడీషియల్ కమిషన్‌కు సీఎం ఆదేశం
- ఆర్సీబీ, ఈవెంట్ కంపెనీ, కేఎస్‌సీఏపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఉత్తర్వులు

## ఎమ్మెల్యే మాగంటి ఆరోగ్యం అత్యంత విషమం



- ఇంట్లో గుండెపోటు.. ఏఐజీకి తరలింపు
- సీపీఆర్ చేయడంతో తిరిగి పనిచేసిన గుండె
- వెంటిలేటర్‌పై కొనసాగుతున్న చికిత్స

# ఉద్యోగులకు రెండు డీఏలు

-మొదటిపేజీ తరువాయి

రూ.10 లక్షలు చెల్లించాలని నిర్ణయించింది. కొత్తగా 86.1 కి.మీ. మేర మూడు మార్గాల్లో మెట్రో నిర్మాణాన్ని రూ.19,579 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సుమారు ఐదున్నర గంటల పాటు క్యాబినెట్ సమావేశం జరిగింది. స్వల్ప అస్వస్థత కారణంగా అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ ఈ సమావేశానికి హాజరు కాలేదు. మిగిలిన మంత్రులందరూ పాల్గొన్నారు. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. త్వరలో మరోసారి మంత్రివర్గం సమావేశమవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. క్యాబినెట్‌లో మొత్తం 70కి పైగా అంశాలపై చర్చించారు.

“మంత్రి మండలి సమావేశంలో ఉద్యోగులకు అనుకూలంగా సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నాం. ఉద్యోగులను సొంత బిడ్డలుగా పరిగణిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు సీఎంకు, మంత్రిమండలికి ధన్యవాదాలు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన క్యాబినెట్ సబ్‌కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించి అందులోని అంశాలకు ఆమోదం తెలిపాం. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు కష్టపడుతున్న ఉద్యోగుల యోగక్షేమాల కోసం, అవసరాలు తీర్చేలా నిర్ణయాలు తీసుకున్నాం. డీఏ కోసం ఉద్యోగ సంఘాలు ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తన నివేదికను సమర్పించింది. ఉద్యోగులు ఇచ్చిన 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించింది. మరికొన్నింటిని పరిశీలనకు స్వీకరించింది. ప్రభుత్వ ఖజానాపై పడే ఆర్థిక భారాన్ని లెక్కలు కట్టి ప్రస్తుతానికి రెండు డీఏలు చెల్లించాలని నిర్ణయించాం. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏల్లో ఒక డీఏను వెంటనే చెల్లిస్తాం. అప్పటి నుంచి బకాయి ఉన్న ఎరియర్స్‌ను 28 వాయిదాల్లో ఇస్తాం. మరో డీఏను ఆర్నెల్ల తర్వాత చెల్లించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం వారు నెలకు రూ.500 చొప్పున చందా చెల్లిస్తే.. దానికి సమాన వాటాను ప్రభుత్వం చెల్లించి.. ఆ మొత్తంతో ఆరోగ్య ట్రస్టును ఏర్పాటు చేస్తాం. ఈ ట్రస్ట్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా అధికారులు, ఉద్యోగులు సభ్యులుగా ఉంటారు. ఆరోగ్యపరమైన సమస్యలను ఈ ట్రస్టు ద్వారా పరిష్కరించే వెసులుబాటు కల్పిస్తాం.

ప్రాధాన్యక్రమంలో బకాయిల చెల్లింపు

ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల బకాయిలు గత ప్రభుత్వం నుంచి మాకు వారసత్వంగా వచ్చాయి. ఈ బిల్లులను ప్రాధాన్యక్రమంలో ప్రతి నెలా రూ.700 కోట్లకు తగ్గకుండా చెల్లిస్తాం. సచివాలయంలో ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల కోటా 12.5 శాతానికి, ఉద్యోగుల మెడికల్ ఇన్‌వాలిడేషన్ కమిటీ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇక నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులను తిరిగి తీసుకోకూడదన్న ప్రతిపాదనకు మంత్రిమండలి అంగీకరించింది. గ్రామపంచాయతీల గ్రేడింగ్ ప్రకారం కార్యదర్శులకు గ్రేడింగ్ ఇవ్వనున్నాం. డీపీసీ రెగ్యులర్‌గా నిర్వహించి, పదోన్నతులు వచ్చేలా నిర్ణయాలు చేశాం. ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులను వెనక్కు తీసుకురావడంతో పాటు కారుణ్య నియామకాలన్నీ వేగంగా పూర్తిచేస్తాం. కొత్తగా నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుకు మంత్రి మండలి నిర్ణయించింది. అంగన్‌వాడీలకు పదవీ విరమణ ప్రయోజనాలు పెంచేందుకు సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. వారి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను రూ.2 లక్షలకు పెంచాలని తీర్మానించింది. ఉద్యోగుల అద్దె వాహనాల బిల్లులు వెంటనే చెల్లించడంతో పాటు అద్దె పెంచే విషయమై సానుకూలంగా నిర్ణయం తీసుకున్నాం. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను గుర్తించడానికి ప్రభుత్వం అంగీకరించింది. జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయించింది.

బీమా కింద రూ.38.5 కోట్లకు ఆమోదం

భద్రాద్రి కొత్తగూడెంలోని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టేందుకు మంత్రి మండలి తీర్మానం చేసింది. స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రమాదవశాత్తు చనిపోతే, వారికి రూ.10 లక్షల బీమా ఇచ్చే కార్యక్రమం ఉండేది. ఇకపై ఇన్సూరెన్స్ ద్వారా కాకుండా.. వారికి ప్రభుత్వమే నేరుగా రూ.10 లక్షలు చెల్లించాలని నిర్ణయించాం. గత ఏడాది 385 మంది చనిపోయారు. వారికి రూ.38.5 కోట్ల నిధులు చెల్లించేందుకు మంత్రిమండలి ఆమోదించింది. ఈ విధానాన్ని భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లు చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయి. గతంలో పాలకులు వారి ఫాంహౌస్‌లకు అనుకూలంగా రోడ్లు వేసుకున్నారు. మా ప్రభుత్వం ప్రతి గ్రామంలో రోడ్డు, గ్రామాల నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్లు, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసల రోడ్లు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు నిర్మించనున్నాం. ఆర్ అండ్ బీ కింద 5,190 కి.మీ, పంచాయతీరాజ్ కింద 7,947 కి.మీ రోడ్లు మొదటి విడతలో హ్యామ్ విధానంలో నిర్మిస్తాం. ఈ రోడ్లు రెండున్నరేళ్లలో నిర్మించి, 15 ఏళ్ల పాటు ఒకే ఏజెన్సీ నిర్వహణ చేపట్టేలా నిర్ణయం తీసుకున్నాం. రాజధానిని గ్రీన్ సిటీగా మార్చేందుకు మెట్రో రైలు మార్గాల విస్తరణ చేయనున్నాం. కారిడార్-1 కింద ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి 39.6 కి.మీ., కారిడార్-2 కింద జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మేడ్చల్‌కు 24.5 కి.మీ, కారిడార్-3 కింద జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేటకు 22 కి.మీ. కలిపి మొత్తం రూ.19,579 కోట్లతో 86.1 కి.మీ మార్గానికి ఆమోదం తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టేలా ప్రతిపాదన పంపించాలని నిర్ణయించాం. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌లు కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తీసుకోవాలి. రాష్ట్రంలో సన్నధాన్యం పండించే రైతులను ప్రోత్సహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. సన్నాల బోనస్‌ను కొనసాగించాలని తీర్మానించింది. సన్న వడ్ల బిల్లులు గ్రీన్‌ఛానెల్ ద్వారా చెల్లించనున్నాం. ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి 12 ఎకరాలు కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది” అని మంత్రులు వివరించారు.

# హైదరాబాద్‌లో రాఫెల్!

న్యూఢిల్లీ

రాఫెల్ యుద్ధవిమానాలకు అవసరమైన ఫ్యూస్‌లాజ్‌ను(విమాన మధ్య భాగాన్ని) ఇకపై భారత్‌లోనే తయారు చేయనున్నారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) సంస్థ వీటిని తయారు చేయనుంది. ఈ మేరకు ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ విమానాల తయారీ సంస్థ దసో ఏవియేషన్‌తో టీఏఎస్ఎల్ 4 ఒప్పందాలు కుదుర్చుకుంది. ఫ్యూస్‌లాజ్ తయారీ కేంద్రాన్ని టీఏఎస్ఎల్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. నౌకాదళానికి రాఫెల్ మెరైన్ జెట్లు అందజేయడానికి భారత ప్రభుత్వం ఫ్రాన్స్‌తో ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.64 వేల కోట్ల ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. దాని ప్రకారం రాఫెల్ జెట్ల బాడీ ఉత్పత్తికి ఒక కేంద్రాన్ని భారత్‌లో ఏర్పాటు చేయాల్సి ఉంది. దాన్నే హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రంలో రాఫెల్ యుద్ధ విమానాలకు అవసరమైన ఫ్యూస్‌లాజ్ సహా కీలక సామగ్రిని తయారు చేస్తారు. విమానానికి ఫ్యూస్‌లాజ్ అత్యంత కీలకమైన భాగం. ఇది సిలిండర్ ఆకారంలో ఉంటుంది. విమానాల వినియోగాన్ని బట్టి ఫ్యూస్‌లాజ్‌ను డిజైన్ చేస్తారు. 2028 ఆర్థిక సంవత్సరానికల్లా ఫ్యూస్‌లాజ్ తయారీని హైదరాబాద్‌లో ప్రారంభించనున్నారు. నెలకు రెండు ఫ్యూస్‌లాజ్‌ను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాఫెల్ యుద్ధ విమానాలకు అవసరమైన ఈ ఫ్యూస్‌లాజ్‌లను ఫ్రాన్స్ వెలుపల తయారు చేయనుండడం ఇదే తొలిసారి. ఇది రక్షణ ఉత్పత్తుల తయారీలో ‘మేకిన్ ఇండియా’కు ఊతమిచ్చే ప్రాజెక్టు అని నిపుణులు



పేర్కొంటున్నారు.

**మరింత వేగంగా ‘రాఫెల్’ సరఫరా**

భారత్‌లో తమ సరఫరా ప్రక్రియను బలోపేతం చేయడానికే ఈ నిర్ణయాత్మక అడుగు వేసినట్లు దసో ఏవియేషన్ ఛైర్మన్ ఎరిక్ ట్రాపియర్ చెప్పారు. తమతో కలిసి పనిచేస్తున్న టీఏఎస్ఎల్‌కు కృతజ్ఞతలు చెప్పారు. భారత ఏరోస్పేస్ పరిశ్రమలో టీఏఎస్ఎల్ ప్రధాన సంస్థగా ఉందన్నారు. రాఫెల్ యుద్ధవిమానాలను మరింత వేగంగా సరఫరా చేయడానికి ఈ భాగస్వామ్యం ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. భారత ఏరోస్పేస్ రంగంలో దసోతో తమ భాగస్వామ్యం కీలక అడుగు అని టీఏఎస్ఎల్ సీఈవో, ఎండీ సుకరణ్ సింగ్ చెప్పారు. టీఏఎస్ఎల్ సామర్థ్యాలపై నమ్మకం ఉండబట్టే దసో ఏవియేషన్ రాఫెల్ ఫ్యూస్‌లాజ్ తయారీ బాధ్యతలను అప్పగించిందని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

-మొదటిపేజీ తరువాయి

పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశం గాంధీభవన్‌లో జరిగింది. పార్టీ నిర్మాణం, ప్రభుత్వ పథకాల ప్రచారంపై విశ్లేషణ వంటి అంశాలపై చర్చించారు. అయితే స్థానిక అంశాలపైనే మూడు నియోజకవర్గాల నాయకులు మాట్లాడినట్టు తెలిసింది. నాగర్‌కర్నూల్ సమావేశంలో ఎంపీ మల్లు రవిని లక్ష్యంగా చేసుకొని మాజీ ఎమ్మెల్యే సంపత్, ఆయన వర్గం నాయకులు మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. పదేళ్లు కష్టపడిన మమ్మల్ని పక్కన బెట్టి ఇతరులకు ప్రియార్టీ ఇస్తారా అని సంపత్ వర్గం మల్లు రవిపై ఫిర్యాదు చేసినట్టు సమాచారం. మహబూబ్‌గర్ పార్లమెంట్ సమావేశంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ ప్రతినిధులుగా తాము చెప్పే విషయాలు అధికారులు వినడం లేదని మీనాక్షికి చెప్పినట్టు సమాచారం.

వరంగల్ పార్లమెంటు సమావేశంలో స్థానిక అంశాలను ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: మీనాక్షి నటరాజన్

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మూడు నియోజకవర్గాల నాయకులకు దిశానిర్దేశం చేశారు. గాంధీభవన్‌లో మూడు నియోజకవర్గాలకు విడివిడిగా జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లా డుతూ పథకాల ప్రభావం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తుందని, ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని రాబోయే ఎన్నికల్లో అనుకూలంగా మలచుకోవాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. సమావేశాల్లో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మూడు నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం జరగనుంది.

## నిధుల సేకరణపై దృష్టి సారించాలి

-మొదటిపేజీ తరువాయి

సమీక్షిస్తామని తెలిపారు. సమావేశంలో సీసీఎల్ఏ నవీన్‌మిత్తల్, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, వికాస్‌రాజ్, రిజ్వీ, శ్రీధర్, వివిధ శాఖల కమిషనర్లు హరిత, హరికిరణ్, విష్ణువర్ధన్, సురేంద్రమోహన్, బుద్ధప్రకాష్ జ్యోతి, ఇలంబర్తి, ఆర్.వి.కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలను కొట్టి పెద్దలకు భూములు

-మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారని మండిపడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి చెందిన బౌన్సర్లు, పోలీసులు రైతులపై విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషమని ‘ఎక్స్’లో గురువారం పోస్టు పెట్టారు. పాలమూరు బిడ్డనని పదేపదే చెప్పుకునే సీఎం.. తన సొంత జిల్లాలో ఘటన జరిగినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు పెద్ద ధన్వాడతోపాటు మొత్తం 12 గ్రామాల రైతులపై దాడి చేసి, 40 మందిపై కేసులు నమోదుచేశారని, 12 మందిని రిమాండ్‌కు పంపారని తెలిపారు. రైతులపై దాడి చేయించిన ఇథనాల్ ఫ్యాక్టరీ యజమాని, బౌన్సర్లపై కేసులు ఎందుకు పెట్టలేదో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పెద్ద ధన్వాడ తరహా ఘటనలు ఏడాదిగా రాష్ట్రంలో అనేకచోట్ల జరుగుతున్నాయని విమర్శించారు. పెద్ద ధన్వాడ ఘటనలో అరెస్టు చేసిన 12 మంది రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**కేసీఆర్ దార్శనికతకు నిదర్శనం హరితహారం**

మాజీ సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే తెలంగాణలో పచ్చదనం 24 శాతం నుంచి 31 శాతానికి పెరిగిందని హరీశ్‌రావు అన్నారు.

## ఎమ్మెల్యే మాగంటి ఆరోగ్యం అత్యంత విషమం

హైదరాబాద్



జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు, భారాస నేత మాగంటి గోపీనాథ్(62) ఆరోగ్యం అత్యంత విషమంగా ఉంది. ఆయనకు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. గురువారం సాయంత్రం ఇంట్లో ఆయనకు గుండెపోటు వచ్చినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు 4.35 గంటలకు ఏఐజీకి తరలించారు. కార్డియాక్ అరెస్టుకు గురైనట్లు వైద్యులు తెలిపారు. సీపీఆర్ చేయడంతో తిరిగి గుండె కొట్టుకోవడం, నాడి, బీపీ సాధారణ స్థితికి రావడంతో... ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. 48 గంటల తర్వాత ఆయన ఆరోగ్యంపై బులెటిన్ విడుదల చేసే అవకాశం ఉంది. కొన్నాళ్లుగా ఆయన కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. మూడు నెలల క్రితం కూడా ఏఐజీలో చేరారు. అప్పట్లో డయాలసిస్ చేయించుకున్నట్లు సమాచారం. మాగంటికి గుండెపోటు వచ్చిన సమాచారం తెలుసుకున్న భారాస నేతలు హరీశ్‌రావు, నామా నాగేశ్వరరావు, కేపీ వివేకానందగౌడ్, మాధవరం కృష్ణారావు, దాసోజు శ్రవణ్, పార్టీ కార్యకర్తలు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం హరీశ్‌రావు ఇతర నేతలు మీడియాతో మాట్లాడారు. మాగంటి కోలుకుంటున్నారని చెప్పారు. మీడియాలో తప్పుడు వార్తలు ప్రసారం చేయవద్దని కోరారు.

**కేటీఆర్ ఆరా...**

విదేశీ పర్యటనలో ఉన్న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్... మాగంటి ఆరోగ్యంపై ఆరా తీశారు. గోపీనాథ్ కుటుంబ సభ్యులతో, ఏఐజీ ఆస్పత్రి వైద్య బృందంతో ఫోన్‌లో మాట్లాడారు. అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని, ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడే అవకాశం ఉందని వైద్యులు కేటీఆర్‌కు వివరించారు. ఈ ఘటన నేపథ్యంలో అమెరికా పర్యటన కుదించుకొని కేటీఆర్ హైదరాబాద్ బయలుదేరుతున్నట్లు తెలిసింది.

# రంగంలోకి నిఘా బృందాలు.. విచారణ ఆరంభం

హైదరాబాద్

తెలంగాణ స్టేట్ ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(రాజ్యాభిలేఖ పరిశోధనాలయం)లో అక్రమ కార్యకలాపాలను నిగ్గు తేల్చడంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దృష్టి సారించింది. విచారణ కోసం అదనపు ఎస్పీ ఆనంద్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించింది. ఆర్కైవ్స్‌లోని విలువైన దస్త్రాలు బయటికి తీసుకురావడం, ఆ స్థానంలో నకిలీ పత్రాలను చొప్పించడంతోపాటు అవే అసలైనవంటూ రాజముద్ర వేసి మరీ ఇస్తూ భూఆక్రమణలకు, న్యాయవివాదాలకు కొందరు కారణమవుతున్న వైనంపై ‘ఆర్కైవ్స్‌లో దొంగలు పడ్డారు!’ హైదరాబాద్ శివార్లలోని విలువైన భూములను కొల్లగొట్టేందుకు కొన్ని ముఠాలు పన్నిన పన్నాగాలను ఆధార సహితంగా కథనంలో ప్రస్తావించిన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ అంశంపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించింది. ఈ మేరకు రంగంలోకి దిగిన విజిలెన్స్ బృందం గురువారం ఉదయం 10 గంటలకే విచారణ ఆరంభించింది. ఆర్కైవ్స్ కార్యాలయం ప్రధాన ద్వారాన్ని మూసివేసి..పలువురు అధికారులు, సిబ్బంది వాంగ్మూలాలను సేకరించింది. సాయంత్రం పొద్దుపోయే వరకూ విచారణ కొనసాగింది.

**నకిలీ దస్త్రాల సేకరణలో నిమగ్నం**

పురాతన కాలం నాటి భూదస్త్రాలకు నిలయమైన ఆర్కైవ్స్ విభాగంలో నకిలీ దస్త్రాల దందాపై విజిలెన్స్ బృందం ప్రధానంగా దృష్టి సారించింది. ఆ విభాగంలోని సిబ్బంది సహకారంతో భూకబ్జాదారులు నకిలీ రికార్డులు సృష్టించిన అంశంపై కూపీ లాగుతోంది. ఇప్పటికే రాయదుర్గంలో 83 ఎకరాలు, మంచిరేవులలో 76 ఎకరాలు, యాచారంలో 10 ఎకరాల భూములకు సంబంధించి నకిలీ దస్త్రాలు సృష్టించినట్లు బహిర్గతం కావడంతో ఆయా రికార్డులను సేకరించడంలో నిమగ్నమైంది. నకిలీ దస్త్రాలు సృష్టించడంలో కీలకపాత్ర పోషించింది ఎవరు, వాటిని ఆర్కైవ్స్‌లోని సంబంధిత విభాగంలోకి ఎవరు చేర్చారు, అనంతరం స.హ.చట్టం దరఖాస్తు ద్వారా ఆ రికార్డులను ఎవరు పొందారు, దాని ఆధారంగా న్యాయవివాదం సృష్టించింది ఎవరు, ఈ ముఠాల వెనక ఉన్న సూత్రధారులెవరు, ఆయా ముఠాలకు సహకరించిన ఇంటిదొంగలు ఎందరున్నారు..తదితర వివరాలను సేకరించే దిశగా విజిలెన్స్ బృందం విచారణ కొనసాగిస్తోంది. ఆయా దస్త్రాలకు సంబంధించిన నోట్‌ఫైళ్లనూ పరిశీలిస్తోంది.

**కేసుల వివరాల కోసం లేఖలు**

నకిలీ దస్త్రాలపై ఇప్పటికే సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంతోపాటు ఉస్మానియా యూనివర్సిటీ, నార్సింగి ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా కేసుల తాలూకు వివరాలు ఇవ్వాలని కోరుతూ సంబంధిత ఠాణాలకు విజిలెన్స్ లేఖలు రాసింది.

**పదేళ్ల కాలంలోని కార్యకలాపాలపై ఆరా**

ఆర్కైవ్స్ విభాగానికి రెండు నెలల క్రితం వరకు డైరెక్టర్‌గా పనిచేసిన జరీనా పర్వీన్ హయాంలో జరిగిన కార్యకలాపాలపై విజిలెన్స్ బృందం ఆరా తీసింది. 2015లో ఉద్యోగ విరమణ పొందిన ఆమె పదేళ్లపాటు ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగారు. ఆ కాలంలో నకిలీ దస్త్రాల ఉదంతాలపై రెండు క్రిమినల్ కేసులు నమోదు కావడానికి దారితీసిన పరిస్థితులపై విజిలెన్స్ అధికారులు వివరాలు సేకరించారు. అలాగే ఆమె హయాంలోనే సరైన అనుమతుల్లేకుండా పర్షియన్ డాక్యుమెంట్లతోపాటు వక్ఫ్‌బోర్డు భూదస్త్రాల డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగిందనే ఆరోపణలపై వివరాలు తెలుసుకుంటున్నారు. ఆమె సర్వీరు పొడిగింపునకు గల కారణాలు, దాని వెనక ఎవరున్నారనేదీ ఆరా తీస్తున్నారు.

# రూ.1 తయారీకి.. రూ.1.11 వ్యయం



ఒక రూపాయి బిళ్ల తయారవడానికి ఒక రూపాయి 11 పైసలు కావాలి. అదే 10 రూపాయల బిళ్లకైతే రూ.5.54. రూ.10 నోటు మన చేతిలోకి రావడానికి సుమారు ఒక రూపాయి ఖర్చవుతోంది. కరెన్సీ తయారవ్వాలన్నా కరెన్సీ కావాల్సిందే. ఈ ఖర్చు ఏటా భారీగా పెరిగిపోతోంది. 2024-25లో కరెన్సీ ముద్రణకు ఏకంగా రూ.6,373 కోట్లు వెచ్చించాల్సి వచ్చింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 25 శాతం ఎక్కువ. నాలుగేళ్లలో ఖర్చు 58.8 శాతం పెరిగిపోయింది. కరెన్సీ నోట్లను కొంత మంది పర్సుల్లోనో, జేబుల్లోనో కుక్కిపెడతారు. పాడవుతాయన్న పట్టింపు ఉండదు. చినిగిపోయినా ఏముందిలే ఏ షాపుల్లోనైనా తీసుకుంటారు అన్న ధీమా. లేదంటే బ్యాంకులో మార్చుకోవచ్చని తేలిగ్గా తీసుకుంటారు. మా డబ్బులు మా ఇష్టం అని కొట్టిపారేయకండి. కరెన్సీ నోటు కూడా ఖర్చు పెట్టి తయారుచేయాల్సిందే. ఎందుకంటే తయారీ, పంపిణీ వ్యయాన్ని జోడిస్తే ఆ కరెన్సీ విలువ మీకు కనిపించే అంకెను మించి ఉంటుంది. కరెన్సీ తయారీలో వాడే సిరా, కాగితం వంటి ముడి సరుకు వ్యయాలకుతోడు సిబ్బంది వేతనాలూ పెరిగాయి. దీని ఫలితంగా ముద్రణ ఖర్చు పెరిగిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల తన వార్షిక నివేదికలో వెల్లడించింది. అంతేగాక నకిలీ నోట్లను చెక్ పెట్టేందుకు ఎప్పటికప్పుడు నూతన సెక్యూరిటీ ఫీచర్లను జోడించడం కూడా ఖర్చును పెంచిందని ఆర్‌బీఐ చెబుతోంది.

**పెరిగిన నోట్ల సరఫరా**

ఆర్‌బీఐ నివేదిక ప్రకారం.. 2020%-%21లో నోట్ల ముద్రణకు రూ.4,012 కోట్ల ఖర్చు అయింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ వ్యయం కాస్తా రూ.6,373 కోట్లకు చేరింది. అంటే నాలుగేళ్లలో 58.8 శాతం ఎగసిందన్నమాట. 2023%-%24లో కరెన్సీ ముద్రణ ఖర్చులు రూ.5,101 కోట్లు. మరో ఆసక్తికర అంశం ఏంటంటే.. నాలుగేళ్లలో దేశంలో నోట్ల సరఫరా దాదాపు 2,233 కోట్ల నుంచి 35.7 శాతం పెరిగి 3,030 కోట్లకు చేరింది. ఆర్‌బీఐకి కరెన్సీ నోట్లు నాలుగు ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి వస్తాయి. ఇందులో నాసిక్ (మహారాష్ట్ర), దేవాస్ (మధ్యప్రదేశ్) ప్రెస్‌లు భారత ప్రభుత్వానికి చెందినవి. మైసూర్ (కర్ణాటక), సల్బోని (పశ్చిమ బెంగాల్) ప్రెస్‌లు రిజర్వ్ బ్యాంక్ అనుబంధ సంస్థ అయిన భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ లిమిటెడ్ యాజమాన్యంలో ఉన్నాయి.

**మూడు రకాల కరెన్సీ**

చెలామణిలో ఉన్న కరెన్సీలో భారత్‌లో ప్రస్తుతం బ్యాంకు నోట్లతోపాటు సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ), నాణేలు ఉన్నాయి. 2024%-%25లో దేశంలో చెలామణిలో ఉన్న బ్యాంకు నోట్ల విలువ 6 శాతం, పరిమాణం (నోట్ల సంఖ్య) 5.6 శాతం పెరిగింది. 2023 మేలో రూ.2000 నోట్ల ఉపసంహరణ ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే. నాటి నుంచి రూ.3.56 లక్షల కోట్లలో 98.2% విలువైన నోట్లు బ్యాంకులకు తిరిగి వచ్చాయి.

**రూ.500 నోట్ల హవా**

గత ఆర్థిక సంవత్సరంలో విలువ పరంగా రూ.500 నోట్ల వాటా ఏకంగా 86 శాతంగా ఉంది. ఏడాదిలో వీటి విలువ స్వల్పంగా తగ్గింది. పరిమాణం పరంగా రూ.500 నోట్ల వాటా 40.9 శాతం ఉంది. చెలామణిలో ఉన్న మొత్తం నోట్లలో రూ.500 నోట్ల వాటాయే అత్యధికం. పరిమాణం పరంగా తరువాతి స్థానాన్ని రూ.10 నోట్లు కైవసం చేసుకున్నాయి. వీటి వాటా మొత్తం పరిమాణంలో 16.4 శాతం. చెలామణిలో ఉన్న నోట్లలో రూ.10, రూ.20, రూ.50 నోట్ల మొత్తం వాటా 31.7 శాతం. గత ఆర్థిక సంవత్సరం చెలామణిలో ఉన్న నాణేల విలువ 9.6 శాతం, సంఖ్య 3.6 శాతం దూసుకెళ్లింది. 2025 మార్చి 31 నాటికి చెలామణిలో ఉన్న మొత్తం నాణేల పరిమాణంలో రూ.1, రూ.2, రూ.5 నాణేల వాటా 81.6 శాతం. విలువ పరంగా ఈ నాణేల వాటా 64.2 శాతానికి చేరింది.

**ఈ-రుపీ కొత్త రికార్డు**

2024-25లో చెలామణిలో ఉన్న ఈ%-%రుపీ విలువ 334 శాతం పెరిగింది. 2025 మార్చి 31 నాటికి ఆర్‌బీఐ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) విలువ రిటైల్ రూపంలో (చెలామణిలో) నాలుగు రెట్లు పెరిగి రూ.1,016.46 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది కేవలం రూ.234 కోట్లు. ఈ%-%రుపీ డిజిటల్ రూపంలో పనిచేసే నగదు. వినియోగదారులు దీన్ని నిల్వ చేయడంతోపాటు బదిలీ కూడా చేయొచ్చు. 2025 మార్చి నాటికి 17 బ్యాంకులు డిజిటల్ వాలెట్స్ ద్వారా ఈ-రుపీని అందిస్తున్నాయి. దీన్ని 60 లక్షల మంది వినియోగిస్తున్నారు.

**పెరిగిన నకిలీ రూ.500 నోట్లు**

2024-25లో బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ రూ.500 నోట్ల సంఖ్య 37.3 శాతం పెరిగిందని ఆర్‌బీఐ వెల్లడించింది. రూ.5.88 కోట్ల విలువైన 1.18 లక్షల నకిలీ రూ.500 నోట్లు (కొత్త డిజైన్) కనుక్కొన్నారు. 2023-24లో రూ.4.28 కోట్ల విలువైన 85,711 నకిలీ నోట్లు గుర్తించారు. నకిలీ రూ.200 నోట్లు 13.9% పెరిగాయి. రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ. 2000 నోట్లలో నకిలీవి.. గతేడాదితో పోలిస్తే వరుసగా 32.3, 14, 21.8, 23 శాతం పెరిగాయి. నకిలీ రూ.2000 నోట్ల సంఖ్య ఏడాదిలో 26,035 నుంచి 3,508 నోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం నకిలీ నోట్ల సంఖ్య 2.17 లక్షలు. అంత క్రితం ఏడాది ఈ సంఖ్య 2.22 లక్షల నోట్లు.

## అయోధ్యలో వైభవంగా విగ్రహాల ప్రాణప్రతిష్ఠ

అయోధ్య



ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య బాలరాముడి ఆలయంలో రెండో దశ విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. రామజన్మభూమి అయిన అయోధ్యలో 2024 జనవరిలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆలయ మొదటి అంతస్తులోని రామ్ దర్బార్‌లో రాజారాముడి విగ్రహాలను నూతనంగా ప్రతిష్ఠించారు. వాటితో పాటు, ఆలయ ప్రాంగణంలోని ఏడు ఉప ఆలయాల్లో కూడా విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ జరిగింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పహల్గామ్ దాడి బాధితులకు ఇంకా న్యాయం జరగలేదు

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఇంతవరకు న్యాయం జరగలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో పోస్ట్ ద్వారా బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జాతీయ భద్రత విషయంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. పహల్గామ్ ఉగ్రదాడి దోషులను ఇంకా పట్టుకోలేదని విమర్శించారు. ఆ ఉగ్రవాదులను పట్టుకుని శిక్షించినప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చి బ్రిడ్జి చినాబ్ వంతెనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేసేందుకు శుక్రవారం కశ్మీర్‌కు వెళ్లనున్న నేపథ్యంలో జైరామ్ రమేశ్ 'ఎక్స్' వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ దాడిలో పాల్గొన్న ఉగ్రమూక 2023 డిసెంబర్‌లో పూంచ్‌లో, 2024 అక్టోబర్‌లో గుల్‌మార్గ్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడుల్లోనూ పాల్గొన్నట్లు కొన్ని నివేదికలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. పహల్గామ్‌లో అమాయకుల ప్రాణాలు బలి తీసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## 4,866కు యాక్టివ్ కేసులు.. ఏడుగురు మృతి



**న్యూఢిల్లీ :** దేశంలో కోవిడ్ కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. గడచిన 24 గంటల్లో 1,238 కొత్త కేసులు నమోదు కాగా, ఏడుగురు మృతి చెందారు. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 4,866కి చేరింది. కోవిడ్-19 కారణంగా మహారాష్ట్రలో ముగ్గురు,ఢిల్లీలో ఇద్దరు, కర్ణాటకలో ఇద్దరు మృతి చెందారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం కేరళలో కొత్తగా 114 కేసులు నమోదయ్యాయి. దేశంలో అత్యధికంగా కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఢిల్లీలలో కేసులు నమోదయ్యాయి. కేంద్రం గురువారం దేశవ్యాప్తంగా కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలలోని ఆసుపత్రుల సంసిద్ధతను తనిఖీ చేయనుంది. వైద్యాధికారులు ఆక్సిజన్ సరఫరా, అవసరమైన మందుల ఏర్పాట్లను పరిశీలించనున్నారు. అలాగే దేశంలోని ప్రధాన ఆసుపత్రులలో వెంటిలేటర్ల లభ్యతను అంచనా వేయనున్నారు. ఓమిక్రాన్ వేరియంట్‌కు చెందిన ఎన్‌బీ .1.8.1 ఉప-వేరియంట్ కోవిడ్-19 కేసుల పెరుగుదల కారణమని వైద్యులు చెబుతున్నారు.

# శర్మిష్ఠ పనోలికి మధ్యంతర బెయిల్



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేసిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ పనోలికి కోల్‌కతా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. రూ. 10,000 పూచీకత్తు(బెయిల్ బాండ్) సమర్పించాలని ఈ సందర్భంగా కోర్టు ఆదేశించింది. 'లా' విద్యార్థిని అయిన 22 ఏళ్ల శర్మిష్ఠని కోల్‌కతా పోలీసులు గత వారం గుర్గాంలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఆమెను కోల్‌కతా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఈ వారం ప్రారంభంలో కోర్టు పనోలికి మధ్యంతర బెయిల్ నిరాకరించింది. 'చూడండి, మనకు వాక్ స్వాతంత్ర్యం ఉంది. కానీ దాని అర్థం మీరు ఇతరులను బాధపెట్టడానికి కాదు. మన దేశం వైవిధ్యమైనది, వివిధ కులాలు, మతాలు, మతాలకు చెందిన వ్యక్తుల గురించి వ్యాఖ్యలు చేసేప్పుడు మనం జాగ్రత్తగా ఉండాలి'. అని జస్టిస్ పార్థ సారథి ఛటర్జీ అన్నారు. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ సందర్భంగా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో శర్మిష్ఠపై దాఖలైన ఫిర్యాదులో ఎటువంటి నేర ప్రవృత్తి లేదని పనోలి తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ఇండియా-పాకిస్థాన్ అంతటా సోషల్ మీడియాలో మాటల యుద్ధం జరిగిందని.. వీరిలో ఎక్కువమంది పర్యాటకులని ఆయన కోర్టుకు తెలియచెప్పే ప్రయత్నం చేశారు. ఇలా ఉండగా, పనోలి అరెస్టు పశ్చిమ బెంగాల్ తోపాటు, యావత్ దేశంలో రాజకీయ వివాదానికి దారితీసింది. బెంగాల్‌లో ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శర్మిష్ఠ పనోలి అరెస్టును "సెలెక్టివ్ ఎన్‌ఫోర్స్‌మెంట్"గా అభివర్ణించింది. అంతేకాదు, కోల్‌కతా పోలీసులు తొందరపాటుతో వ్యవహరించారని ఆరోపించింది. అటు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా శర్మిష్ఠ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా తాను శర్మిష్ఠకు అండగా ఉంటానని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

## బెంగళూరు నగర పోలీస్ కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు

బెంగళూరు

ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద చోటుచేసుకున్న విషాద ఘటనపై కర్ణాటక ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. బెంగళూరు పోలీస్ కమిషనర్‌తో పాటు తొక్కిసలాటతో సంబంధం ఉన్న ఇతర పోలీస్ ఉన్నతాధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తూ సీఎం సిద్ధరామయ్య ఆదేశాలు జారీ చేశారు. ఆర్సీబీ ప్రతినిధులతో పాటు డీఎన్ఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులను తక్షణమే అరెస్టు చేయాలని డీజీపీ, ఐజీపీలను ఆదేశించినట్లు సీఎం వెల్లడించారు. ఈ మేరకు మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. క్యాబినెట్ సమావేశంలో తొక్కిసలాట ఘటనపై చర్చించినట్లు సీఎం సిద్ధరామయ్య తెలిపారు. ఈ విషాద ఘటనపై దర్యాప్తు చేసేందుకు విశ్రాంత హైకోర్టు జడ్జి నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ కమిషన్ 30 రోజుల్లో నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌస్ మాస్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఏసీపీ, సెంట్రల్ డివిజన్ డీసీపీ, క్రికెట్ స్టేడియం ఇన్‌ఛార్జి, అదనపు పోలీస్ కమిషనర్, నగర పోలీస్ కమిషనర్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

**బెంగళూరు తొక్కిసలాట ఘటన.. ఆర్సీబీ, కేఎస్‌సీఏపై కేసు నమోదు**

చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్సీబీ జట్టు విజయోత్సవ సభకు లక్షలాది మంది అభిమానులు తరలిరావడంతో జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతి చెందగా.. 50మందికి పైగా గాయపడిన ఘటన పెను విషాదం నింపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కబ్బన్ పార్క్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్సీబీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ) సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నేరపూరిత నిర్లక్ష్యంగా పేర్కొంటూ పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## ఛత్తీస్ గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్

మావోయిస్టు పార్టీకి మరో తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అగ్రశ్రేణి నాయకుల్లో ఒకరైన, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ సుధాకర్, భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు హతమైన నెల రోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి టైగర్ రిజర్వ్ ప్రాంతంలో మావోయిస్టు సీనియర్ నాయకులు సమావేశమయ్యారన్న కచ్చితమైన సమాచారంతో భద్రతా దళాలు రంగంలోకి దిగాయి. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) దళాలు సంయుక్తంగా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో, గురువారం తెల్లవారుజామున మావోయిస్టులకు, భద్రతా దళాలకు మధ్య భీకరమైన కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో సుధాకర్ మరణించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సుధాకర్... మావోయిస్టు వర్గాల్లో గౌతమ్, ఆనంద్, చంటి బాలకృష్ణ, రామరాజు, సోమన్న వంటి అనేక మారుపేర్లతో సుపరిచితుడు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు గ్రామం. గత నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో చురుగ్గా పనిచేస్తున్న సుధాకర్‌పై ప్రభుత్వం రూ. కోటి రివార్డు ప్రకటించింది. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో కూడా ఆయన పాల్గొన్నారు.బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్‌కౌంటర్ ఘటనను ధృవీకరించారు. అయితే, సుధాకర్ మృతికి సంబంధించి అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం బీజాపూర్ అటవీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గత ఆరు నెలల కాలంలో మావోయిస్టు కేంద్ర కమిటీకి చెందిన ముగ్గురు కీలక నాయకులను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేయడం, మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బగా పరిగణిస్తున్నారు. మూడు వారాల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద ఎదురుదెబ్బ.

**ఇదే ప్రాంతంలో మరికొందరు మావోయిస్టు అగ్రనేతలు!**

ఇదే ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇన్‌ఛార్జి బండి ప్రకాశ్, స్పెషల్ జోన్ కమిటీ సీనియర్ లీడర్ పాపారావు కూడా ఉన్నట్లు తమకు సమాచారం అందిందని బస్తర్ ఐజీ పి.సుందర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశ్... మావోయిస్టుల నియామకాలు, ప్రచారం, దక్షిణ బస్తర్‌లోని కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్నాడని, ఆయనపై రూ.25 లక్షల రివార్డు ఉందని పేర్కొన్నారు. ఇక పాపారావు గెరిల్లా యుద్ధతంత్రంలో నిపుణుడని, ఐఈడీ దాడులతో సహా అనేక హింసాత్మక ఘటనల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడని, అతడిపై రూ.20 లక్షల రివార్డు ఉందని తెలిపారు. అయితే, వీరిద్దరి ఆచూకీకి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. భద్రతా దళాలు ఆ ప్రాంతంలో తమ గాలింపును ముమ్మరం చేశాయి.

## సామాన్యుల ప్రాణాలంటే వారికి విలువ లేదు



బెంగళూరు

ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై మరోసారి స్పందించిన భాజపా అధికార కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఆర్సీబీకి స్వాగతం పలికి ఆటగాళ్లతో సెల్ఫీలు తీసుకున్న నేతలు.. ప్రమాదం తర్వాత బాధితులను పరామర్శించలేదని భాజపా నేత ఆర్ అశోక విమర్శించారు.

**వారి ప్రాణాలకు విలువ లేదా..?**

"చిన్నస్వామి స్టేడియం వద్ద ఘోరం జరిగింది. ఈ ఘటనపై యావత్ దేశం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఆర్సీబీ రాష్ట్రానికి వచ్చిన వెంటనే ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి ఆటగాళ్లకు స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు.. ఆటగాళ్లు, ఐపీఎల్ ట్రోఫీతో సెల్ఫీలు తీసుకున్నారు. కానీ, ఆ తర్వాత తొక్కిసలాటలో చనిపోయిన వారి ఇళ్లకు వెళ్లలేదు. బాధిత కుటుంబాలను పరామర్శించలేదు. బాధితుల పట్ల కాంగ్రెస్‌కు ఎలాంటి బాధ లేనట్లుగా కనిపిస్తోంది. వారికి సామాన్యుల ప్రాణాలంటే విలువ లేదు" అని తీవ్ర ఆరోపణలు చేశారు.

సామాన్యుడి ప్రాణం విలువ చాయ్ కప్పు కంటే చౌకనా?.. 'తొక్కిసలాట'పై హర్ష్ గోయెంకా పోస్ట్

కాగా.. చిన్నస్వామి స్టేడియం వద్దకు చేరుకున్న వేలాది మంది అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. దీంతో తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదైంది. ఆర్సీబీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ) సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు, ఈ కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేస్తున్నట్లు కర్ణాటక ప్రభుత్వం తెలిపింది.

# హైందవ సామ్రాజ్య నిర్మాత శివాజీ


పుణ్యభూమి అయిన భారతావనిలో అనేకానేక దేశ భక్తులు తమ జీవితమే ధర్మంగా, ధర్మ ప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యులైనారు. వారిలో నిత్య స్మరణీయుడు శివాజీ. శాలివాహన శకం 1596 ఆనంద నామ సంవత్సరం జ్యేష్ఠ శుక్ల త్రయోదశి శనివారం సూర్యోదయాత్ పూర్వం మూడు ఘడియల ముహూర్తాన 1674 జూన్ 6న, చత్రపతి శివాజీ సింహాసనాన్ని అధిష్టించాడు. తద్వారా తొలి స్వరాజ్య సంస్థాపకుడైనాడు. అందుకే జ్యేష్ఠ శుక్ల త్రయోదశిని "హిందూ సామ్రాజ్య దినం"గా జరుపు కుంటారు. నేలకొరిగిన హిందూ ధ్వజాన్ని, మళ్లీ ఉత్తుంగ శిఖరాలలో ఎగురవేసి, మృతప్రాయమై ఉన్న హిందుత్వంలో అమృతాన్ని నింపి, ప్రాణప్రతిష్ట చేసిన మహనీయుడు శివాజీ. అతి సామాన్య బాల్యం, సాహసోపేత యవ్వనం, ప్రదర్శిత ధైర్యం, రాజనీతిజ్ఞత, చతురత, హిందువులలో మేల్కొల్పిన ఆ పూర్ణ దేశభక్తి అజరామరాలు. మహారాష్ట్ర ప్రాంతంలో, యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం, 1307 మార్చి 24 తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనము చేయబడగా, 350 ఏళ్ళ వరకు మరియొక ఒక హిందూ సామ్రాజ్యమే లేకుండెను. ఔరంగాబాద్ సమీపాన వేరూడ్ గ్రామానికి చెందిన మాలోజీ రావు అహ్మద్ నగర్ సుల్తాన్ నిజాం షాహీ కొలువులో ఉద్యోగియై, శక్తియుక్తులతో పూనా జాగీరును సంపాదించాడు. మొగలులతో యుద్ధం చేస్తూ 1605 లో మరణించాడు. అప్పటికి మాలోజి రావుకు 5ఏళ్ల శహాజి, 3 ఏళ్ల అరిఫ్ జీ కుమారులు ఉండిరి. మాలోజీ తమ్ముడగు విటోజీ వద్ద పెరగగా, నాటి నిజాం షాహీ కొలువులోని సర్దార్ లఖుజీ రావు కూతురు జిజియాబాయితో శహాజీ వివాహం జరిగింది. చిన్నతనంలోనే అత్త వారి ఇంటికి వచ్చిన జియాకు దేశ పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగింది. గోవధలు, దేవాలయాలు విగ్రహాల ధ్వంసాలు, ఆస్తుల దోపిడీలు, ఇళ్ల దహనాలు చూశాక ఆమెలో జుగుప్స రేగింది. బాల్యముననే రామాయణ, భారతాది గ్రంథాల పఠనం మూలంగా, విదేశీ పాలన నుండి విముక్తి కలిగి, రామరాజ్య స్థాపన కావాలనే కోరిక ప్రబలమైన నిలిచింది. జిజియాబాయి తండ్రి లఖుజీ రావు కు ముగ్గురు కుమారులు కాగా, వారి పలుకుబడులు నిజాం షాహికి కన్నెర్ర గావించగా, తన రాజధాని యగు దౌలతాబాద్ కు, ఆయన కుమారులను పథకం ప్రకారం పిలిపించి, నలుగురిని 1629 జూలై 25 ఆషాడ పౌర్ణమి నాడు హత్య గావించాడు. శహాజీ మొగలుల వద్ద పనిచేస్తున్న సమయాన, 1630 ఫిబ్రవరి 19వ తేదీన, "భావి హైందవసామ్రాజ్య నిర్మాత" అయిన శివాజీ జన్మించాడు. శహాజీ తన జాగీరు పాలనా నిర్వహణకై, పండితుడు, పాలనాదక్షుడు "దాదాజీ కొండదేవ్" అనే బ్రాహ్మణుని నియమించుకోగా, జిజియాబాయి, కుమారునితో సహా ఆయన పర్యవేక్షణలో ఉండిరి. దాదాజీ కొండదేవ్, శివాజీకి వయసుకు తగ్గ విద్యలు, చక్కని శిక్షణనిచ్చి, పదవ ఏట వివాహం కూడా చేశాడు. వివాహానికి రాలేని తండ్రిని కలవడానికి బెంగళూరు వెళ్ళిన శివాజీకి, తండ్రి బీజాపూర్ ను చూపించగా, తురుష్కుల వల్ల ఉజ్వలమైన విజయనగర సామ్రాజ్యం విధ్వంసం, ఫలితంగా కొల్లగొట్ట బడిన ధనముతో వారు ఆనందంతో తులతూగే సంఘటనలు, హృదయంలో ప్రతిష్ఠితాలైనాయి. శివాజీ స్వాతంత్ర్య భావాలను గ్రహించిన శహాజీ, తన కుమారుని పూనాకు పంపుతూ, శాం రావు రాంఘెకర్ అనే అనుభవజ్ఞుని పీష్వా గా నియమించాడు. దేశభక్తి ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీకి, తల్లి శిక్షణ లోనే రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యము నిర్మాణం చేయాలని కోరిక స్థిరపడింది. శివాజీ జాగీరు లో రాంఝూ గ్రామపు పటేలు, ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేల్ ను బంధించ, వధించి, కాళ్లు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడయ్యాడు. కాశ్మీరం నుండి కావేరి వరకు మధ్యనున్న చాందా గోండు వనం వదిలి, మిగిలిన దేశమంతా తురుష్కుల ఆధీనంలో ఉండెను. దేవగిరి, విజయనగరం



రాజ్యాలు స్థాపించాక, రెండుసార్లు శహాజీ చేసిన ప్రయత్నాలు విఫలం కాగా, శివాజీ మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం పాటుపడిన దేవాలయం, కొండ గుహ, కీకారణ్యం, ఇసుక తిన్నె లాంటి ప్రదేశాలలో చర్చోప చర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన "కాన" లోయలోని "తోరణ దుర్గాన్ని" జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. అందు లభించిన నిధితో, తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న "మురుంబ దేవ" గిరి పై, కొత్త కోటను నిర్మించి "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత "కువారి" కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కు పచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత "కొండనా కోట"ను తన స్వరాజ్యంలో కలుపు కున్నాడు. "శివరళ", "సుభాను మంగళి" దుర్గాలను వశపరచు కున్నాడు. ఇంతలో 1648 జూలై 25న శహాజీ, వజీరు ముస్తఫా, బాజీ ఘోర్పడెలు సైన్యంతో శహాజీ బంధించాడు. బీజాపూర్ సుల్తాన్ ను శరణు వేయడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే ప్రశ్నలకు తల్లి జిజియాబాయి, తన మాంగల్యం కన్నా దేశభక్తిని ప్రోత్సహించి సమాధానం లభింప జేసింది. పురంధర కోటలో ఉన్న శివాజీ, కొద్ది సైన్యానికి ఫతేఖాను సైన్యానికి భీకర యుద్ధం జరగగా, శివాజీకే విజయం చేకూరి, చివరకు 1648 ఆగస్టు 8న ఫతేఖాను ఓడింప బడ్డాడు. పురంధర దుర్గంలో ఫతేఖాను, బెంగళూరులో ఫరాదఖాన్ ఓటమి పాలు కాగా, బీజాపూర్ లో శహాజీ కూడా 1649 మే 16న జేష్ఠ లేక పౌర్ణమి నాడు బంధ విముక్తుడైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహారాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా, శివాజీ వారిని బంధించి ఉచిత పదవులు కట్టబెట్టి, నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానది సమీప టావలి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేక పోగా, ఆయన భార్య దత్త పుత్రునిగా యశ్వంత రావు కు పదవిని ఇచ్చాడు. ఆయన శివాజీ అధికారానికి ఇష్టపడని కారణాన, 1656 లో యుద్ధంలో ఓడించి స్వరాజ్యంలో కలుపు కున్నాడు. దీనిలో అంతర్భాగంగా కొండ ప్రాంతమైన "రాయగిరి" కోట నే కొన్నాళ్ళకు శివాజీ రాజధానిగా "రాయగడ దుర్గం"గా ఏర్పడింది. 1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్ షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదార్ ఐన, ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న రాజ్యంలో కలుపు కున్నాడు. బీజాపూర్ ప్రాంతంనుండి కోండ్వానా, కొంకణ, దండ రాజపురి, భీమండి, కళ్యాణి, మాహు తదితర కోటలను, పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని చేయించాడు. కటావ్, మయని, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాలిఘుడ్,ఎగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కార తలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావ సింహ, జస్వంత్ సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్, సూరత్ నగరాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ జైత్రయాత్ర ఫలితంగా శాలివాహన శక 1596 ఆనంద నామ సంవత్సర జ్యేష్ఠ శుక్ల త్రయోదశి శనివారం సూర్యోదయాత్పూర్వ మూడు ఘడియల సుముహూర్తాన 1674 జూన్ 6 న సింహాసనాన్ని అధిష్టించాడు. రాజ్యాభిషేక అనంతరం రాజ్యారోహణం జరిగింది. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెండర్ మహారాజుకు ప్రణమిల్లి, 1600 రూపములను కానుకగా సమర్పించాడు. తన రాజ్యానికి అష్ట ప్రధానుల పారశీక నామాలను మార్చి, "సంస్కృత పేర్లు" పెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగం సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశము ను తయారు చేయించాడు. 30 సంవత్సరాలు శివాజీ ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ, హిందువులలో నూతనోత్తేజం నింపి, సార్వభౌమాధికార యుక్త స్వరాజ్యం స్థాపించ బడినది. 50 ఏళ్ల సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా, దేహం పూర్తిగా అలసి పోగా, ఆరోగ్యం క్షీణించి, 1680 ఏప్రిల్ 3న చైత్ర శుక్ల పాడ్యమి నాడు శివాజీ తుది శ్వాస వదిలాడు.

# నీటి పారుదల రంగానికి కెఎల్ రావు ఎనలేని సేవలు

నీటిపారుదల రంగంలో అపర భగీరథుడిగా కీర్తించబడే తెలుగు ప్రజలు గర్వించ దగిన డా. కానూరి లక్ష్మణరావు (జూన్ 6, 1902 – మే 18, 1986) భారత దేశం లోనే గాక ప్రపంచ వ్యాప్తంగా నీటిపారుదల రంగంలో విప్లవాత్మకమైన పనులు చేసిన గొప్ప ఇంజనీరు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య తర్వాత గొప్ప వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. 1902 జూలై 14న కృష్ణా జిల్లా కంకిపాడు గ్రామంలో జన్మించిన కె.ఎల్.రావు మద్రాసు విశ్వ విద్యాలయములో ఇంజ నీరింగు (బీ.ఈ) డిగ్రీ పూర్తి చేసి, గిండీ ఇంజనీరింగు కళాశాల నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి, మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఇంజ నీరింగులో మాస్టరు డిగ్రీ (ఎం.ఎస్.సి ఇన్ ఇంజనీరింగ్) పొందిన తొలి వ్యక్తిగా నిలిచారు. చదువు పూర్తయిన తర్వాత విశాఖ జిల్లా బోర్డు అసిస్టెంట్ ఇంజనీరుగా పని చేశారు. తదనంతరం రంగూన్ కూడా ఉద్యోగం చేశారు. కొంత కాలం తర్వాత రావు గారు గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశోధ కుడిగా చేరారు. ఇంగ్లండ్ లోని బర్నింగ్ హెూమ్ విశ్వ విద్యాలయం నుండి 1939 లో డాక్టరేట్ డిగ్రీ పొందారు. కొంత కాలం పాటు ఇంగ్లాండ్ లో ప్రొఫెసర్ గా పనిచేసిన ఆయన 1946లో భారత దేశం తిరిగి వచ్చి మద్రాసు ప్రభుత్వంలో డిజైన్ ఇంజనీర్ గా చేరారు. 1950 – 54 మధ్యకాలంలో భారత ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్ గా పని చేశారు. ప్రభుత్వంలో ఇంజనీర్ గా పని చేస్తున్న సమయాన, దేశం లోని అనేక నీటిపారుదల ప్రాజెక్టు లకు నమూనాలు తయారు చేశారు. నాగార్జునసాగర్, పులిచింతల, శ్రీశైలం, శ్రీరాంసాగర్



వంటి ఎన్నో సుప్రసిద్ధ నీటిపారుదల పథకాలకు రూపకల్పన చేశారు. గంగా, బ్రహ్మపుత్ర తదితర నదుల వరదల నివారణకై అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. అందులో భాగంగానే గాంధీ సాగర్ , జవహర్ సాగర్ రాణాప్రతాప్ సాగర్ వంటి నిర్మాణాలు సిద్ధం చేశారు. నాటి ప్రభుత్వం నాగార్జున సాగర్, భాక్రానంగల్ ప్రాజెక్ట్, హిరాకుడ్ ప్రాజెక్ట్ విషయంలో పిలిపించిన విదేశీ ఇంజనీర్లు కూడా రావు ను సంప్రదించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. ఇంజనీరింగ్ విషయాలకు సంబంధించి ఈయన రాసిన "ఇండియాస్ వాటర్ వెల్త్" అనే పుస్తకం నేటి తరాల శాస్త్రవేత్తలకు ప్రామాణిక గ్రంథంగా ఉంది. ఉద్యోగ విరమణ అనంతరం నాటి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డి పిలుపు మేరకు 1962, 1967 ,1971 లో విజయవాడ నుంచి పార్లమెంటుకు పోటీ చేసి గెలిచారు. నెహ్రూ, శాస్త్రి, ఇందిరా గాంధీ, నేతృత్వంలోని ప్రభుత్వంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రిగా పని చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే గంగా బ్రహ్మపుత్ర నదిలో వర్షాకాలంలో చేరుతున్న నీటిని నిల్వ ఉంచి భారతదేశంలో క్షామ ప్రాంతాలైన మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు నీటి సౌకర్యం కల్పించే "నేషనల్ వాటర్ గ్రిడ్" పథకానికి రూపకల్పన చేశారు. 1963లో పద్మభూషణ్, రూర్కీ, ఆంధ్రా మరియు జే ఎన్ టీ విశ్వ విద్యాలయాల డాక్టరేట్లు పొందారు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్, అలాగే ఆల్ ఇండియా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ సాయిల్ మెకానిక్స్ అండ్ జియోటెక్నికల్ ఇంజనీరింగ్ (ఆసియా) వైస్ ప్రెసిడెంట్ గా, రంగూన్ (బర్మా, ఇప్పుడు మయన్మార్)లో ప్రొఫెసర్‌గా, యునైటెడ్ కింగ్‌డమ్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఇంజనీరుగా చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మూడు పర్యాయాలు రాష్ట్రపతి పురస్కా రం లభించింది. ఆయన జ్ఞాపకార్థం పులిచింతల ప్రాజెక్టుకు కె.ఎల్.రావు ప్రాజెక్టు అని నామ కరణము చేయ బడింది. ఒక ఇంజనీరు పేరును ప్రాజెక్టుకు పెట్టడం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఇదే ప్రథమం. 1986 మే 18 న 84 సంవత్సరాల వయసులో మృతి చెందారు.

# స్వదేశీ నినాదం దేని కోసం?

"ఆత్మశుద్ధి లేని యాచారమదియేల? భాండశుద్ధి లేని పాకమేల? చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా? విశ్వదాభిరామ వినురవేమ". ఏనాడో వేమన చెప్పిన ఈ పద్య తాత్పర్యాన్ని పెడచెవిన పెట్టడమే కాదు, "ఆచరించనిదే ఆడంబర మదియేల, అనుసరిం చనిదే యట్టి ప్రచార మదియేల" అని చెప్పించుకునే స్థితిలో నేతల ప్రవర్తనలున్నవి. ఆపరేషన్ సింధూర్ అనంతరం ఇప్పుడు స్వదేశీ వస్తువుల వినియోగంపై నేతల పెద్దపెద్ద ప్రగల్భాల ప్రసంగాలు వినిపిస్తు న్నాయి. పాపం ఈ ప్రసంగాలు నిజమనుకుని సాధారణ ప్రజానీకం సోషల్ మీడియా ఆయుధాలతో విషప్రచారానికి గురవుతున్నారు. ఈ స్వదేశీ నినాదం వినిపించే నాయకులను అడగవలసిన అనేక ప్రశ్నలు ఉన్నవి. మొట్టమొదటిది, విదేశీ వస్తువులని మన దేశంలోకి ఆహ్వానిస్తున్నది ఎవరు? విదేశీ వస్తువులు మాకు కావాలి అని ఎక్కడైనా పోరాటాలు లేదా అభ్యర్థనలు ప్రజలనుండి జరిగాయా? వస్తు సేవలను వినియోగిస్తున్న వారందరూ స్వదేశానివి వద్దు విదేశీవి మాత్రమే కావాలని ఎక్కడైనా పట్టు బట్టారా? ఇట్లాంటి మౌలిక అంశాలను వదిలిపెట్టి "విదేశీ వస్తువులను బహిష్కరించండి, చివరికి చిన్న చిన్న వినాయకుల విగ్రహాలను కూడా విదేశాల్లో తయారు చేయబడిన వాటిని వినియోగిస్తున్నారు" అంటూ ప్రజలను ముద్దాయిలను చేసే ప్రసంగాలు అర్థరహితమైనవి. చిన్న చిన్న వినాయక విగ్రహాలు కాదు 3300 కోట్ల రూపాయల ప్రాజెక్ట్‌గా చెప్పబడుతున్న సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహాన్ని తయారు చేసింది కూడా విదేశీ సంస్థలేనన్న విషయం ప్రజలకు తెలియదనుకుంటే ఎలా? స్వదేశీ నినాదం కేవలం రాజకీయ లబ్ధి కోసం, ఓట్లు దండుకోవడం కోసం లేదా చైనాను పరోక్షంగా విమర్శించడం కోసం చేసే కుటిల ప్రయత్నాలే తప్ప చిత్తశుద్ధి ఎక్కడా లేదు. నూతన ఆర్థిక విధానాలకు బార్లా తలుపులు తెరిచి, విదేశీ సంస్థలు తమ ఇష్టానుసారం తమ వస్తువులను ప్రపంచ మంతా అమ్ముకోవచ్చని, భారతదేశం అందరికీ ఆహ్వానం పలుకుతున్నదని చెప్పినది ప్రభుత్వాలా లేక ప్రజలా? ఇప్పటికి కూడా ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌డీఐ)దకి అర్రులు చాస్తూ ఆహ్వానిస్తున్నది ప్రజలా, ప్రభుత్వాలా? భారతదేశంలో తయారైన సి విటమిన్ ట్యాబ్లెట్లు కూడా అమెరికా హెచ్చరిస్తే ఇక్కడ అవసరాలను ఏమాత్రం అంచనా వేయకుండా అమెరికాకు ఎగుమతి చేసింది ప్రభుత్వాలా, ప్రజలా? ఈరోజు విదేశీ నిల్వలు దేశాల ఆర్థిక పటిష్టతకు ఆనవాళ్లుగా మారిపోయాయి. ఈవిదేశీ నిల్వల కోసం ఆరాటపడుతున్నది ప్రజలా ప్రభుత్వాలా? "డిపార్ట్మెంట్ అఫ్ కామర్స్" అనుమతిలేనిదే విదేశీ వస్తువుల దిగుమతి జరుగుతుందా? "డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్" వారి అనుమతి లేనిదే విదేశీ వస్తువుల దిగుమతిపై నియమ నిబంధనలు రూపొందించ పడుతున్నాయా? వాటి నాణ్యతను అవసరాన్ని ధ్రువీకరిస్తున్నది ఈ డీజీఎఫ్‌టీ కదా? మారిన పరిస్థితుల్లో ఆన్‌లైన్ వ్యాపారాలు పెరగడం వల్ల "అంతర్జాతీయ ఆన్‌లైన్ సప్లింగ్ స్టోర్స్"ని ఏర్పాటు చేసింది భారతదేశ ప్రభుత్వమా లేక ప్రజలా? ఇలాంటి వ్యాపార అభివృద్ధి కోసం "ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్" స్థాపించింది మన ప్రభుత్వం కాదా! దీనికోసం"ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్" అనే సంస్థను ఏర్పాటుచేసింది మన ప్రభుత్వమేగా! వీటన్నిటినీ మించి కస్టమ్స్ డిపార్ట్మెంట్ ప్రభుత్వానికి రావాల్సిన నిధుల కోసం ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ వ్యవహారాలను చక్కబెట్టడం లేదా? ప్రభుత్వాలు అంతర్జాతీయ ప్రమాణాలను పాటించాల్సిన దుస్థితి ఏర్పడింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తమ దేశానికి ఎవరైనా, ఏవైనా వస్తువులను పంపించాలంటే అనేక షరతులు విధిస్తూ, టారిఫ్ పెంచుతూ గెంతులు వేస్తున్నాడు. వాటిని కాదనలేని స్థితిలో చాలా దేశాలతో పాటు భారత్ కూడా ఉన్నది. అనేక వస్తువులను దిగుమతి చేసుకోనిదే పూట గడిచే పరిస్థితి లేని పరస్పర ఆధారిత ఆర్థిక వ్యవస్థలుగా దేశాల పరిస్థితి ఉన్నది. భారత దేశంనుంచి అనేక వస్తువుల మరియు సేవల ఎగుమతి మనం అనుమతించే దిగుమతులపై ఆధారపడి ఉన్నది. చమురు దిగుమతి చేసుకోనిదే దీపం వెలిగే పరిస్థితి లేదు. అది విదేశీ వస్తు కదా అని నిషేదించగలంమా? మేక్ ఇన్ ఇండియా పేరు మీద భారత వాయుసేనకు,మిలిటరీకి ఉపయోగపడే యుద్ధ సామాగ్రిని పదేళ్లలో మనం పెంచుకోవాలని పూనిన ప్రతిజ్ఞలన్నీ ఏమైనట్లు? తాజాగా కూడా రఫేల్ యుద్ధ విమానాల కోసం ఫ్రాన్సుకి దరఖాస్తు పెట్టుకోవాల్సి వచ్చింది? ఇలా చేయమని ప్రజలెవరైనా కోరుతున్నారా? పాలనుండి మొదలు బీఫ్ వరకు, గోధుమల నుండి మొదలు కాటన్ వరకు, పువ్వుల నుండి మొదలు చేపల వరకు అనేక ఆహారపదార్థాలను ఎగుమతి చేస్తున్నాం. అదే సందర్భంలో వ్యవసాయోత్పత్తులను ఉండి మొదలు కర్మాగారాలకు అవసరమయ్యే పారిశ్రామిక ఉత్పత్తులను దిగుమతి చేసు కోవాల్సిన పరిస్థితి కూడా ఉన్నది. సాంకేతికత పెరిగిన తర్వాత చేతివృత్తులు దాదాపు కనుమరుగైపోయాయి. ప్రతీ పనిముట్టు యాంత్రీకరణ ద్వారా తయారవుతుంది. ఆపిల్ కంపెనీ భారతదేశంలో తమ యూనిట్‌ను నెలకొల్పి ఐఫోన్‌లు తయారు చేస్తామని ముందుకు వస్తుంటే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బాహాటంగా వ్యతిరేకిస్తూ ఆపిల్ కంపెనీ యాజమాన్యాన్ని బెదిరిస్తున్నాడు. దీనిపై ఇక్కడి అధికారులు ఏ మాత్రం స్పందించక పోవడం దేనికి సంకేతం? అనేక కంపెనీలకు చైనా అమెరికాలు స్థావరంగా ఉన్నవి. అక్కడ పనిచేస్తున్న సాంకేతిక నిపుణులలో అత్యధిక శాతం భారత సంతతియే. మరి అలాంటి నైపుణ్యం గల భారతీయులను ఇక్కడ వినియోగించడానికి తీసుకుంటున్న చర్యలు శూన్యం! ఇక్కడి మేధో సంపత్తి మొత్తం వలసెళ్తూనే ఉన్నది. విద్యా విధానాన్ని సరిదిద్దుకుని, అంతర్జాతీయ విద్యాసంస్థలను ఏర్పాటుచేసి, వృత్తివిద్యాకోర్సులను విపరీతంగా అమలు పరిచి, సహజసంపదను వినిమయ రూపంలోకి మార్చే ప్రయత్నాలు చేయనప్పుడు దేశ ప్రజలకు కావాల్సిన వస్తువులన్నీ ఈ దేశంలోనే తయారయ్యే అవకాశం ఎక్కడుంది! విచిత్రమేమంటే స్వదేశీ నినాదాన్ని సభా వేదికల ద్వారా వినిపించే నాయకులు వినియోగించే కార్ల నుండి కళ్లద్దాలవరకు విదేశాల్లో తయారైతే తప్ప దిక్కులేదు. స్వదేశీ నినాదం భారత ప్రజలను బాగా ఆకర్షిస్తుంది. దీనికి కారణమేమంటే స్వాతంత్రోద్యమంలో పాటించిన ఈ స్వదేశీ నినాదం బాగా సఫలమైంది. అనేక సినిమాలు విదేశీ వస్తు బహిష్కరణ స్వాతంత్రోద్య మకారులు ఏ విధంగా పాటించారో చూపించి భావోద్వేగాలను తట్టిలేపారు. ఈ స్వదేశీ నినాదానికి సంబంధించిన చరిత్రను ఒకసారి గమనిస్తే 1905లోనే ఈ స్వదేశీ నినాదం బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగసిపడింది. ఆ తర్వాత బ్రిటిష్ అణచివేతకు, మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావానికి అది సద్దుమణిగింది. 1922లో మహాత్మాగాంధీ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా మళ్లీ ఈ స్వదేశీ నినాదం బహు ప్రాచుర్యంలోకి వచ్చి, విదేశీ వస్తువులన్నింటినీ బహిష్కరించాలని పిలుపునే భారత ప్రజలందరూ పాటించారు. ముఖ్యంగా బ్రిటిష్ వారి నుండి దిగుమతి అయ్యే వస్త్రాలు, లిక్కర్, ఉప్పు వంటివాటిని పూర్తిగా వ్యతిరేకించారు. ఉప్పు తయారీ కోసం ఉప్పు సత్యాగ్రహం అనే పెద్ద ఉద్యమాన్నే గాంధీజీ ఆధ్వర్యంలో చేపట్టాల్సి వచ్చింది. ఆర్థిక స్వయం సమృద్ధి సాధిస్తే దేశం దానంతటదే రాజకీయ స్వేచ్ఛ సాధించే అవకాశం ఉన్నదని నాటి స్వాతంత్ర్య సమరయోధులు భావించి, దానికోసం స్వదేశీ నినాదాన్ని దేశ ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. స్వదేశంలో అన్ని సమకూరాలంటే యువతకి ప్రత్యామ్నాయ ఉపాధి వృత్తివిద్యా కోర్సుల ద్వారా అందించాలని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పుడు ఇంజనీరింగ్ తప్ప ఇతర ఒకేషనల్ కోర్సులు ఏవి ప్రత్యామ్నాయంగా అందుబాటులో లేవు. ప్రభుత్వాలు ఆ వైపు దృష్టి పెట్టడమే లేదు. స్వాతంత్ర్యానంతరం కూడా స్వదేశీ నినాదాన్ని విడిచిపెట్టలేదు. జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో విదేశీ కంపెనీలన్నింటినీ విలీనం చేసి స్వదేశీ సంస్థలుగా ఏర్పాటు చేశారు. ఇనుము, ఉక్కు కర్మాగారాలు, చమురుశుద్ధి కర్మాగారాలు స్థాపించుకోకపోతే మనుగడ అసాధ్యమని భావించి, బ్రిటన్, రష్యా, వెస్ట్ జర్మనీ వంటి దేశాల సహకారంతో మన దేశంలో స్థాపించారు, గనుకనే ఇప్పుడు ఉక్కును ఎగుమతి చేసే దేశాల్లో భారత్ అగ్రగామిగా ఉంది. "మంగళ్ యాన్ మిషన్" సక్సెస్ ఫుల్‌గా ప్రయోగిస్తున్న నేటి భారత్ 1962 నాటి స్వదేశీ విధానంలో నిర్ణయమేనని మర్చిపోకూడదు. దీన్ని బట్టి అర్థమవుతున్నదేమంటే పాలకులు విదేశీ వస్తువులను బహిష్కరించమని ఇవ్వాల్సింది నినాదాలు కాదు, స్వదేశంలో వస్తుత్పత్తులు తయారయ్యే పరిస్థితులు ఏర్పరచాలి, ప్రోత్సహించాలి. తద్వారా విదేశీ వస్తువులు తమంతటవే దిగుమతి కావడం ఆగిపోతాయి. అనేక దేశాలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని తమ దేశంలోని నైపుణ్యాలను వివిధ రూపాల్లో వినియోగించుకుంటూ యువతకు ప్రోత్సాహకాన్ని ఇవ్వడం వలన అత్యంత చౌకగా మరింత నాణ్యత కలిగిన వస్తువులను తయారు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు.

# పిచ్చి అభిమానం - జీవితం అంధకారం





**ప్రాణాలు తీస్తున్న పిచ్చి అభిమానం**

**అభిమానం హద్దులు దాటితే భవిష్యత్తు అంధకారమే**

**ఇటీవల తరచూ జరుగుతున్న ప్రమాదాలు పిచ్చి అభిమానానికి నిదర్శనంగా మారుతున్నాయి**



**అనంతపూర్, జూన్ 05( సూర్య ప్రతినిధి):** ఒకప్పుడు అభిమానం అనేది ఆదరణ, ప్రేమ, గౌరవం అనే భావాలతో నిండిన ఒక పవిత్రమైన పదంగా ఉండేది. కానీ ఈ మధ్య కాలంలో ఇది విచక్షణ కోల్పోయిన, భయానక పరిణామాలను తెచ్చే "ఫ్యానిజం"గా మారుతోంది. అభిమాని అనబడే వ్యక్తి పరిమితి దాటి వెళ్లినప్పుడు, అది మనోరోగ లక్షణంగా మారుతోంది. మన దేశంలో ఇటీవల జరిగిన కొన్ని దురదృష్టకర సంఘటనలు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**పుష్ప ప్రమోషన్ ఈవెంట్ - కుటుంబం చిన్నాభిన్నం**

హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన ఒక సినిమా ప్రమోషన్ ఈవెంట్‌లో, సెలబ్రిటీని చూసేందుకు వచ్చిన వేలాది మంది తొక్కిసలాటకు గురయ్యారు. ఒక మహిళ అక్కడే మరణించింది. ఆమె కుమారుడు ఇంకా కోమాలో ఉన్నాడు. సెలెబ్రిటీలను చూసేందుకు జనం ఎగబడడం, భద్రతా చర్యలపై ప్రభుత్వ యంత్రాంగాల నిర్లక్ష్యం... ఇవన్నీ కలిసి ఒక కుటుంబాన్ని చీకటిలోకి నెట్టేశాయి.

బెంగళూరులో క్రికెటర్లు విజయోత్సవ ర్యాలీ %-% గెలుపు తర్వాతి విషాదం

ఐపీఎల్ విజయం అనంతరం బెంగళూరులో జరిగిన క్రికెట్ ర్యాలీలో, స్టేడియం వరకు వెళ్లేందుకు ప్రయత్నించిన వేలాది మందిలో తొక్కిసలాట జరిగింది. 11 మంది అక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆట గెలిచిన ఆనందాన్ని సెలబ్రేట్ చేయడం కోసమే ప్రాణాలను పణంగా పెట్టాలా?

బాధ్యత ఎవరిది?

ఇలాంటి సంఘటనల్లో బాధ్యత ఎవరిది?

గుడ్డిగా సెలెబ్రిటీలను ఆరాధించే అభిమానులదా?

భద్రత చర్యల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వ యంత్రాంగాలదా?

ప్రోగ్రాములు నిర్వహించేవారి మౌలిక సదుపాయాల లోపమా? ఎవరి తప్పైనా బాధితులు మాత్రం సాధారణ ప్రజలే. తాము చేయని తప్పుకు జీవితాన్ని కోల్పోవడం ఎంత బాధాకరం!

ఫ్యానిజం - అభిమానం కాదు, మనోవ్యాధి!

అభిమానం అంటే ప్రేరణ, ఆదర్శం. కానీ ఫ్యానిజం అంటే వ్యక్తి తన జీవితాన్ని మరచిపోయి మరొకరిలా తన జీవితాన్ని జీవించడమే. ఇది ఓ మానసిక వ్యాధిలా మారుతోంది.

**ఫ్యానిజం లక్షణాలు:**

వ్యక్తిత్వం కోల్పోవడం:

నేను ఎవరు?" అనే ప్రశ్నకు సమాధానం లేకుండా, "నేను ఫలానా సెలబ్రిటీ అభిమాని" అనే లిమిటెడ్ గుర్తింపు.

జీవిత లక్ష్యాలను మర్చిపోవడం:

చదువు, కెరీర్, కుటుంబ బాధ్యతల కంటే %-% సినిమా రిలీజ్, హీరో వచ్చేది ఎప్పుడూ అనే విషయాలకే ప్రాధాన్యత.

ఆనుకరణాత్మక జీవితం:

సెలబ్రిటీ స్టైల్, డైలాగ్‌లు, దుస్తులు, మాట్లాడే తీరు%ొ%

అన్నీ కాపీ పేస్ట్.

ఆరోగ్యంపై ప్రభావం:

నిద్రలేకుండా వీడియోలు చూడటం, గంటల తరబడి వేచి ఉండటం, భోజనం మర్చిపోవడం - ఇవన్నీ శరీరానికీ మనసుకీ హానికరం.

**విదేశాల్లో అభిమాన సంస్కృతి ఎలా ఉంటుంది?**

ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టును గౌరవించేందుకు వాళ్ల దేశ ప్రజలు పెద్దగా రోడ్డెక్కలేదు. న్యూజిలాండ్, అమెరికా వంటి దేశాల్లోనూ ఇదే దృక్కోణం. అక్కడ అభిమానాన్ని ఆచరణాత్మకంగా, సమతులితంగా చూపుతారు. అభిమానం వాళ్లకు ఒక "అనుభవం", మన దేశంలో అది "బానిసత్వం"గా మారుతోంది. అక్కడ సెలబ్రిటీలు దేవుళ్లలా కాదు, ప్రజల భాగస్వాముల్లా ఉంటారు.

**మీ జీవితానికి - మీరే హీరో!**

ఒకరిని చూసి ఊగిపోవడం ముందు ఒకసారి ఈ ప్రశ్న వేసుకోండి:

" నేను నా జీవితానికి ఏం చేస్తున్నాను?"లి

మీరు కూడా ఒక రంగంలో మేటి కాదా కావచ్చు?

మీరు కూడా హీరోలే అవవచ్చు కదా?

వాళ్లు ప్రయత్నించారు %-% క్రికెటర్లు అయ్యారు.

వాళ్లు పట్టుదలతో ఉన్నారు %-% నటులు అయ్యారు.

వాళ్లు దారులు వెతికారు %-% నాయకులు అయ్యారు.

మీరూ ప్రయత్నిస్తే ఎందుకు సాధించలేరు?

వాళ్ల విజయాలను చూసి స్ఫూర్తి పొందండి, కానీ జీవితాన్ని వాళ్ల కోసం త్యాగం చేయడం తప్పు.

అభిమానం కావాలి మార్గదర్శకం

అభిమానం గుడ్డిగా కాకూడదు. అది జ్ఞానంతో, వివేచనతో, స్పష్టతతో ఉండాలి.

సెలెబ్రిటీలను కాకుండా %-% స్వీయ ప్రతిభను అభిమానించండి!

మీ జీవిత విజయాల కోసం శ్రమించండి. మీ కుటుంబం కోసం, సమాజం కోసం, దేశ భవిష్యత్తు కోసం మీరు మేటిగా మారండి.

అప్పుడే %-% దేశానికి యువ శక్తి అవసరమైన దిశలో కదలుతుంది.

మీరు ఎవరినైనా అభిమానించాలనుకుంటే%-% మీరు మిమ్మల్నే అభిమానించండి.

మీ లక్ష్యాలను, కష్టాలను, స్వప్నాలను గౌరవించండి.

జీవితంలో మీరే హీరోగా నిలబడండి %-% ఎవరో సెలబ్రిటీ కోసం మీ విలువైన జీవితం తాకట్టు పెట్టొద్దు!

యువత మారితేనే %-% దేశం మారుతుంది.

అభిమానం తెలివిగా ఉండాలి %-% పిచ్చిగా కాదు!

**జి. అజయ్ కుమార్**

# అట్టహాసంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాల పంపిణీ





**మునుగోడు, జూన్ 05( సూర్య ప్రతినిధి):** మునుగోడు నియోజకవర్గం వ్యాప్తంగా మొదటి దశ లో అర్హులైన నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లుల లబ్ధిదారులకు మునుగోడు లోని క్యాంపు కార్యాలయం వద్ద అట్టహాసంగా పండుగ వాతావరణం లో ఇందిరమ్మ ఇల్లుల మంజూరి పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు... చండూరు మున్సిపాలిటీ, చండూరు, మునుగోడు, నాంపల్లి, మర్రిగూడెం, గట్టుప్పల్ మండలాలలో ఇందిరమ్మ ఇల్లులు మంజూరైన లబ్ధిదారులకు నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం గారితో కలిసి ఇందిరమ్మ ఇల్లుల మంజూరి పత్రాలను పంపిణీ చేసిన మునుగోడు శాసనసభ్యులుకోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇండ్లు మంజూరు అయిన ప్రతి ఒక్క లబ్దిదారునికి పేరు పేరునా శుభాకాంక్షలు. ఇండ్లు రాని వాళ్ళు అధైర్య పడొద్దు అర్హులైన పేద వాళ్ళందరికీ ఇండ్లు ఇప్పించే బాధ్యత నాది.

మునుగోడు నియోజకవర్గం లో కనీసం 10 000 (పదివేల) ఇండ్లు మంజూరి అవసరం ఉంది.. కానీ ప్రస్తుతానికి 3500 మంజూరు అయ్యాయి. పదవీ ఉన్నా లేకున్నా.... నా జీవితము మునుగోడు ప్రజలకు అంకితం. మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా చెబుతున్నా... కాంగ్రెస్, బిజెపి,టిఆర్ఎస్ అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లులు మా ప్రభుత్వం ఇస్తుంది.

నియోజకవర్గంలో కనీసం పది వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు కావాలి ,ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా.. ఇల్లు రానివారు ఎట్టి పరిస్థితిలో బాధపడొద్దు, భయపడొద్దు,



అధైర్య పడొద్దు. మొదటి విడతన అర్హులైన నిరుపేదలకు 3500 మందికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నాం, తక్కినవారందరికీ రెండవ విడతలో ఇల్లులు ఇస్తాము. ఇల్లు అనేది ఆత్మ గౌరవం, గత పది సంవత్సరాలలో ప్రభుత్వం ఏ ఒక్కరికి ఇల్లు కట్టిన పాపాన పోలేదు...

అర్హులు ఏ ఒక్కరు ఇందిరమ్మ ఇళ్లు లేకుండా ఉండరాదు, అదే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో అనర్హులకు ఇల్లు రాకూడదు, ఈ బాధ్యత అధికారులపై ఉంది.

కొంత మంది నిరుపేదలు ఇదివరకే బేస్మెంట్ నిర్మించుకున్నారు, అలాంటి వారికి సైతం ఇల్లు ఇచ్చే విధంగా ప్రభుత్వానికి లేఖ రాయాలని జిల్లా కలెక్టర్ కు సూచన. ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకంగా ఉండాలి. ప్రభుత్వం ఇంటి కోసం మంజూరు చేస్తున్న 5 లక్షల రూపాయలు సరిపోవని ,ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి నల్గొండ జిల్లాలోని అన్ని సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నందున డిస్కౌంట్ పై సిమెంట్ ఇచ్చే విధంగా లబ్ధిదారులకు మేలు జరిగేలా మాట్లాడతా.. నిరంతరం ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం కృషి చేస్తాను నిరుపేద కుటుంబాల అందరికీ సొంతింటి కళ నెరవేరే వరకూ పోరాడుతా.... శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సంవత్సరాల తరబడి పూరి గుడిసెలో నివసిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం సంతోషం. నియోజకవర్గంలో సుమారు పది వేల మంది వరకు నిరుపేదలు ఉన్నారు, వారందరికీ ఇల్లు రావాల్సిన అవసరం ఉంది. మునుగోడు నియోజకవర్గం పూర్తిగా ఫ్లోరైడ్ ప్రాంతమని ,సుమారు 1500 ఫీట్లు బోరూ వేసినా నీరు పడని పరిస్థితి.. అర్హులకే అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా చూసే బాధ్యత అధికారులపై ఉంది అప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా డిండి,ఎస్ఎల్బీసీ, బ్రాహ్మణ వెల్లంల సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే మునుగోడు సస్యశ్యామలం అవుతుంది. క్షేత్ర స్థాయిలో మరోసారి పూర్తిగా పరిశీలించి అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేస్తున్న... ఈ కార్యక్రమం లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,రెవిన్యూ. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, తదితరులు హాజరయ్యారు.

## ఇందిరమ్మ నిర్మాణాలు వేగవంతం చేయాలి

**- 27 ఇండ్లు శాంక్షన్**

**- ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనులు..**





**గుండాల, జూన్ 05( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా: గుండాల మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్లకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం 400 నుంచి 600 పేట్లకు మించకుండా ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్ రావు గ్రామపంచాయతీ సెక్రటరీ మొహమ్మద్ మునోవర్ గుండాల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అన్నెపర్తి యాదగిరి ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొడిశెట్టి వెంకన్న గౌడ్ కొడపర్తి భాస్కర్ మైస రమేష్ అన్నెపర్తి యాదగిరి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు

**బిఆర్ఎస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ నాయకులు రాచకొండ గిరి.**




**సంస్థాన్ నారాయణపుర్, జూన్ 05( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని, సగానికి పైగా అనర్హులకే ఇండ్లు కేటాయించారని , భూములు ఉన్నవారికి అర్హత లేనివారికి ఇల్లులు కేటాయించారని ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేతివాటం ప్రదర్శించారనీ బిఆర్ఎస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ యువజన విభాగం నాయకులు రాచకొండ గిరి పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఎంతోమంది నిరుపేదలు భూములు లేక, ఇండ్లు లేక అద్దె ఇళ్లల్లో ఉంటున్న వారికి కాకుండా కాంగ్రెస్ నాయకులు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలో సగానికి పైగా అనర్హులేననీ అన్నారు. ప్రజాపాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపిక పారదర్శకంగా జరగాలని ప్రతి నిరుపేదకు పథకం అందాలని ప్రభుత్వ పెద్దలు ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెబుతుంటే. స్థానికంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం వారి ఆదేశాలను విస్మరించి ఇష్టరీతిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడం సిగ్గుచేటని ఆరోపించారు. ప్రజాపాలనలో ప్రభుత్వ అధికారుల పాత్ర పేక్షక పాత్ర గానే మిగిలిందని, దరఖాస్తుదారుని పూర్తి స్థితిగతులు, వివరాలు వాస్తవాలను తెలుసుకోకుండానే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన లిస్ట్ ఫైనల్ చేయడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి ప్రజలు ప్రభుత్వ అధికారులను విశ్వసిస్తారు వారిపైనే భరోసా పెడతారు. కానీ ప్రభుత్వ అధికారులు మాత్రం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆదేశాలతో నడవడం నిజంగా బాధాకరమే. అధికారులు ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించలేదనేది స్పష్టంగా స్పష్టమవుతుంది. ఇందిరమ్మ కమిటీల పేరా నడిచిన రాజకీయం అంత ఇంత కాదు. బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపిక ప్రక్రియలో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులకే వత్తాసు పలుకుతున్న అధికారుల పేర్లను రెడ్ బుక్ లో రాసుకుంటాం వచ్చేది మా ప్రభుత్వమే అప్పుడు తప్పక చూసుకుంటామని తెలిపారు.ప్రజలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. గ్రామాల ల్లో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, మళ్లీ సారె రావాలి, కారె కావాలి, కేసీఆర్ రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని భారీ స్థాయిలో గెలిపించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కెసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా బిఆర్ఎస్ పాలన జరిగితే....నేడు కక్షలు, కుట్రలు,కుతంత్రాలతో కక్ష సాధింపు చర్యలతో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని ఈ సందర్భంగా వారు అన్నారు.

## మొక్కలతోనే మనిషి మనుగడ ఉంటుంది: చినుకని యువరాజు




**భూదాన్ పోచంపల్లి, జూన్ 05(సూర్య ప్రతినిధి):** మొక్కలతోనే మనిషికి మనుగడ ఉంటుందని సహస్ర ఫౌండేషన్ అధ్యక్షులు చినుకని యువరాజు అన్నారు. భువనగిరి జిల్లా పోచంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీ య పర్యావరణదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచీకరణ నేపథ్యంలో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందన్నారు. ప్లాస్టిక్ వినియోగం పెరగడం, చెట్ల నరికి వేత, వాయు కాలుష్యం, జల కాలుష్యం వంటి చర్యలు పర్యావరణానికి ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాగేల్లి సందీప్, గడ్డం సాగర్, సిరిమల్లె జస్వంత్, పగడాల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రమ్మ లబ్ధిదారుల పత్రాల పంపిణీ



**సూర్య ప్రతినిధి మర్రిగూడ** మునుగోడు నియోజకవర్గ లో గురువారం రోజు నా నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో కోమటి రాజగోపాల్ రెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు మరియు మర్రిగూడ మండలంలో వట్టిపల్లి గ్రామపంచాయతీలో 27 ఇండ్లు లబ్ధిదారులకు పత్రాలు అందజేశా రూ ఇందులో వట్టిపల్లి గ్రామ సీనియర్ నాయకులు మెండు నరసింహారెడ్డి గ్రామ శాఖ అధ్యక్షు డు సలివోజు బిక్షమాచారి సంధ్య తిరుపతి బషీర్ మంగమ్మ యాదమ్మఎడ్ల రావిపల్లొనారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి



**సంస్థాన్ నారాయణపూర్, జూన్ 05( సూర్య ప్రతినిధి ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రానికి చెందిన గంటిల యాదయ్య యాదవ్ - అబ్బమ్మ దంపతులకు కుమార్తె మాధవి- రవి యాదవ్ దంపతుల వివాహము ఎస్.వి. ఎల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ పుట్టపాకలో వారి వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి

ఈ కార్యక్రమంలో నయా తెలంగాణ రిపోర్టర్ సోమన బోయిన కృష్ణ కుమార్ యాదవ్, చిలువేరు శీను, కొండ నవీన్ గౌడ్, గంటిల శరత్, గంటిల శేఖర్,చిన్న శేఖర్,రాజు,లింగస్వామి,శరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళకు ముగ్గు వేసిన అధికారులు



**మద్దూర్, జూన్ 5:-** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం రోజు మండల ఎంపీడీవో నర్సింహారెడ్డి లబ్ధిదారులకు ముగ్గు వేసి ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి 60 గజాల వరకు ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు వేస్తామని ఈ సందర్భంగా ఆయన. గ్రామస్తులకు లబ్ధిదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ,గ్రామస్తులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిరాజ్ నెట్ వర్క్ పై ఫోకస్



**హైదరాబాద్ :** విజయనగరం బాంబు పేలళ్ల కుట్ర కేసులో మరికొన్ని పేర్లు బయటకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటలిజెన్స్ తో పాటు ఎన్ఐఏ అధికారుల విచారణలో మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. విజయనగరంతో పాటు హైదరాబాద్, వరంగల్, బెంగళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో బాంబ్ బ్లాస్ట్ లు చేయడానికి ప్లాన్ వేసిన సిరాజ్ గ్యాంగ్ కు పేలుడు పదార్థాల కొనుగోలుకు సంబంధించిన నిధులు ఇమ్రాన్ అక్రమ్ పంపినట్లు తేలింది. ఇమ్రాన్ అక్రమద్ హైదరాబాద్. అయితే ఇమ్రాన్ సౌదీలో సెటిలయ్యాడు. సిరాజ్ ఏర్పాటు చేసిన అహీం గ్రూపునకు సంబందించి ఆకర్షితుడైన ఇమ్రాన్ ఎంత డబ్బులు అయినా పేలుడు సామగ్రి కొనుగోలుకు పంపుతానని సిరాజ్ తో చెప్పినట్లు తేలింది. ఇమ్రాన్ అక్రమ్ సిరాజ్ కు సౌదీ లో ఉండి ఆర్థిక సహకారం అందించగా, వరంగల్ కు చెందిన ఫర్హాన్ మొహియుద్దీన్ తో పాటు ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన బదర్ తో పాటు మరికొందరు సిరాజ్ గ్యాంగ్ లో యాక్టివ్ గా ఉన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. గత ఏడాది చివరలో ముంబయి, ఈ ఏడాది ప్రారంభంలో ఢిల్లీకి వెళ్లిన సిరాజ్ పలువురిని కలిశారు.అద్నార్ ఖురేషీ, దిల్షన్, మోషిన్ షేక్, జస్సీర్, షమద్, అమీర్ అన్సారీలో సిరాజ్ భేటీ అయి మాట్లాడినట్లు కౌంటర్ఇం లిజెన్స్ అధికారులు, ఎన్ఐఏ అధికారులు తేల్చారు. వారితో సిరాజ్ ఏం మాట్లాడారు? వారిని సిరాజ్ ఎలా ఉపయోగించుకోవాలనుకున్నాడు? అన్న దానిపైనే ప్రస్తుతం అధికారులు దర్యాప్తు కొనసాగుతుంది సిరాజ్, సమీర్ ల కదలికలను ముందుగా గుర్తించడంతో బాంబుపేలుళ్ల కుట్ర భగ్నమయింది. ఈ ఇద్దరికి అన్ని రకాలుగా సహకారం అందించిన వారిపైనే ఇప్పుడు ఎన్ఐఏ అధికారులు ఫోకస్ పెట్టారు. ఇంకా ఎవరెవరి ఖాతాలో నిధులు ఏమైనాజమ అయ్యాయా? సిరాజ్ తో పాటు ఇంకా ఎవరైనా పేలుడు పదార్థాలు కొనుగోలు చేశారా? అన్న కోణంలో ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. విజయనగరం పోలీసులు నమోదు చేసిన ఈ కేసును ఎన్ఐఏ అధికారులు తీసుకుని దేశ వ్యాప్తంగా సిరాజ్ నెట్ వర్క్ ను ఛేదించాలన్న భావనలో ఉన్నారు. విదేశీ హ్యాండర్లను గుర్తించడంతో పాటు దేశంలోని పలు ప్రాంతంలో ఉన్న స్లీపర్ సెల్స్ ను తమ కస్టడీలోకి తీసుకోవడం ద్వారా మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశముందని ఎన్ఐఏ అధికారులు భావిస్తున్నారు

# రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి సదస్సులు





**గుండాల, జూన్ 05( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా: రైతుల భూ సమస్యలు పరిష్కారం కోసమే భూభారతి సదస్సు నిర్వహిస్తున్నామని తాసిల్దార్ ఎస్ హరికృష్ణ అన్నారు గురువారం సీతారాంపురం మాసన్ పల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడుతూ భూభారతిలో రెవిన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న వారి సమస్యల పరిష్కారం కోసం విచారణ జరిపి తగు న్యాయం చేస్తామని అన్నారు ప్రజల వద్దకే రెవెన్యూ సేవలు కార్యక్రమానికి మంచి స్పందన ఉందని రైతులు తమ సమస్యలను తెలియజేస్తున్నారని మేము ఇచ్చే దరఖాస్తు ఫారం నింపి మీ దగ్గర ఉన్న దానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలిపినట్లైతే పూర్తి విచారణ జరిపి రైతులకు న్యాయం చేస్తామని అన్నారు ముఖ్యంగా చనిపోయిన వారి స్థిర చరస్తులు కలిగి ఉన్న రైతులు సర్వేనెంబర్ ప్రకారంగా ఎలాంటి మార్పులు చేర్పులు ఉన్న చేసుకోవాలన్నారు పెండింగ్ లో ఇతర సమస్యలు ఏవి ఉన్నా కూడా ఈ సదస్సులో దరఖాస్తు చేసుకున్నట్లయితే విచారణ జరిపి పరిష్కరిస్తామని అన్నారు ఇందులో భాగంగా సీతారాంపురం గ్రామంలో నుండి 25 దరఖాస్తులు రాగ మాసాన్ పల్లి గ్రామంలో నుండి 11 దరఖాస్తులు వచ్చినట్టు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ నీలిమ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆర్ఐ అనసూర్య,కృష్ణ, నాగార్జున, ఎల్లయ్య, యాదగిరి,మాధవి ఉమా వెంకన్న యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

# 56/1984 తరహా ఆర్డినెన్సును కేంద్రం జారి చేయాలి



**వికారాబాద్, జూన్ 05( సూర్య ప్రతినిధి):** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తీసుకొచ్చిన 56/ 1984 ఆర్డినెన్సును అధ్యాయనం చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మిగతా 11 రాష్ట్రాలను ఎస్సీ జాబితాలో చేర్చే విధంగా ఆర్డినెన్సు జారీ చేసి దేశవ్యాప్తంగా ఒకే కులవృత్తి చేస్తున్న ధోభీలకు ఎస్సీ రిజర్వేషన్ అవకాశాన్ని కల్పించాలని గోపి రజక కోరారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా సంయుక్త కార్యదర్శి సి. వెంకటయ్య , పట్టణ అధ్యక్షులు వెంకటప్ప అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్యనాయకుల సమావేశానికి గ్రామ మాజీ సర్పంచ్ సంగెపల్లి రమేష్,రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక , అంబేద్కర్ యువజన సంఘం అన్నారం అధ్యక్షులు సాయిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు .

గోపి రజక మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో టీడీపీ పార్టీ నారా లోకేష్ యువగళం పాదయాత్రలో టీడీపీ ప్రభుత్వం వస్తే ఎస్సీ జాబితాలో చేర్చుతామని , తెలంగాణ బీజేపీ పార్టీ 2018 మ్యానిఫెస్టోలో బీజేపీ ప్రభుత్వం వస్తే ఎస్సీ జాబితాలో చేర్చుతామని అన్నారు కానీ బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో రజకుల ఎస్సీ అంశాన్ని ఎందుకు లేవనెత్తడం లేదో, ఎస్సీ అంశంపై 2016 డిసెంబర్ 26న అసెంబ్లీలో మాట్లాడిన రేవంత్ రెడ్డి ఎందుకు ఆ దిశగా అడుగులు వేయడం లేదో రజక కులస్తులకు మూడు పార్టీలు సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. సమావేశానికి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్.అశోక్ , జిల్లా ఉపాధ్యక్షులు బాలప్ప, సీనియర్ నాయకులు సుందరప్ప , మహేష్,బీమప్ప , విజయ్, వీరేశం , ఆనంద్,శేఖరప్ప, కృష్ణ,సాయమ్మ,పెద్ద మల్కమ్మ,నిర్మలమ్మ, పార్వతమ్మ,మంజూల , రత్నమ్మ, చిన్న మల్కమ్మ తదితరులు పాల్గొన్నారు

# నేను విన్నాను... నేను ఉన్నాను అంటున్న కేటీఆర్



**హైదరాబాద్ :** కేటీఆర్, జగన్ మోహన్ రెడ్డి ప్రసిద్ధ డైలాగ్ "నేను విన్నాను... నేను ఉన్నాను"ను ఒక ఇంటర్వ్యూ లేదా బహిరంగ సమావేశంలో ఉటంకించారని సోషల్ మీడియా పోస్ట్‌లు సూచిస్తున్నాయి. ఈ డైలాగ్ జగన్ 2019 ఎన్నికల సమయంలో తన పాదయాత్రలో విస్తృతంగా ఉపయోగించిన "నేను విన్నాను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) కొన్ని రోజులుగా సహనం కోల్పోతున్నారు. ఓటమి తర్వాత కేటీఆర్ వైఖరిలో చాలా మార్పులు వచ్చాయి. అప్పటి వరకు డీసెంట్ నేత అనుకున్న అందరూ ఆయన నోటివెంట వస్తున్న మాటలు చూసి షాక్ అవుతున్నారు. తాజాగా ఆయన తన మిత్రులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డైలాగులను ఉటంకిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇవి రాజకీయ వర్గాల్లో సంచలనం రేకెత్తించాయి. సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ డైనమిక్స్‌పై కొత్త చర్చకు దారితీసింది.కేటీఆర్, జగన్ మోహన్ రెడ్డి ప్రసిద్ధ డైలాగ్ "నేను విన్నాను? నేను ఉన్నాను"ను ఒక ఇంటర్వ్యూ లేదా బహిరంగ సమావేశంలో ఉటంకించారని సోషల్ మీడియా పోస్ట్‌లు సూచిస్తున్నాయి. ఈ డైలాగ్ జగన్ 2019 ఎన్నికల సమయంలో తన పాదయాత్రలో విస్తృతంగా ఉపయోగించిన "నేను విన్నాను? నేను ఉన్నాను" అనే నినాదం నుంచి పుట్టింది, ఇది మొదట వైఎస్ రాజశేఖర రెడ్డి బయోపిక్ "యాత్ర" సినిమాలో ప్రముఖంగా వినిపించింది.2023లో ఒక యూట్యూబర్ సందీప్‌తో జరిగిన ఇంటర్వ్యూలో కేటీఆర్, జగన్‌తో తన వ్యక్తిగత స్నేహాన్ని ప్రస్తావిస్తూ, వారిద్దరూ దావోస్ పర్యటనలో రెండు గంటల పాటు కలిసి డిన్నర్ చేశామని చెప్పారు. ఈ సందర్భంలో జగన్‌ను "పెద్దన్న లాంటి వాడు" అని సంబోధించారు. ఈ స్నేహం, రాజకీయ సందర్భంలో జగన్ డైలాగులను కేటీఆర్ ఉపయోగించడానికి ఒక నేపథ్యంగా కనిపిస్తుంది. 2025 మార్చి 23న ఒక ఎక్స్ పోస్ట్‌లో, కేటీఆర్ జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులను ఉత్తేజపరిచిందని, ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని పేర్కొన్నారు.కేటీఆర్ జగన్ డైలాగులను ఉపయోగించడం వెనుక రాజకీయ వ్యూహం కనిపిస్తుంది. 2023 తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి, 2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఓటమి తర్వాత, కేటీఆర్, జగన్ ఇద్దరూ తమ పార్టీలను పునర్నిర్మించే ప్రయత్నంలో ఉన్నారు. కేటీఆర్, జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా, వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారుల మనోభావాలను ఆకర్షించే ప్రయత్నం చేసి ఉండవచ్చు, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సమానమైన రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో. జగన్ యొక్క "నేను విన్నాను? నేను ఉన్నాను" డైలాగ్ ప్రజల సమస్యలను ఆలకించడం, వారికి అండగా ఉండటం అనే సందేశాన్ని సూచిస్తుంది. కేటీఆర్ ఈ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా తెలంగాణలో ప్రజలతో తన సాన్నిహిత్యాన్ని, వారి సమస్యల పట్ల తన నిబద్ధతను చాటి ఉండవచ్చు. అలాగే, ఈ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా జగన్‌తో తన స్నేహాన్ని, రాజకీయ సహకారాన్ని హైలైట్ చేసే ప్రయత్నం కూడా కనిపిస్తుంది.కేటీఆర్ జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశమైంది. ఒక ఎక్స్ పోస్ట్‌లో, "జగన్ అన్న డైలాగ్ కేటీఆర్ గారు చెప్తే ఫైర్" అని పేర్కొన్న యూజర్, ఈ వ్యాఖ్యలు వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులను ఉత్తేజపరిచాయని తెలిపారు. ఈ డైలాగ్ వైరల్ కావడంతో, రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో కేటీఆర్ వ్యూహాత్మకంగా జగన్ ఇమేజ్‌ను ఉపయోగించుకున్నారనే చర్చ మొదలైంది.అయితే, ఈ వ్యాఖ్యలు కొంత వివాదాన్ని కూడా రేకెత్తించాయి. 2024లో ఒక నివేదిక ప్రకారం, కేటీఆర్, జగన్ ఇద్దరూ సోషల్ మీడియా ద్వారా రాజకీయ ప్రచారం చేయడంలో ఓడిపోయారని, వారి సోషల్ మీడియా వ్యూహాలు ఓట్లుగా మారలేదని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, కేటీఆర్ జగన్ డైలాగ్‌ను ఉపయోగించడం కొందరు సోషల్ మీడియా ఆధారిత రాజకీయ ఆకర్షణగా చూస్తున్నారు, మరికొందరు దీనిని రాజకీయ స్నేహానికి సంకేతంగా భావిస్తున్నారు."నేను విన్నాను? నేను ఉన్నాను" డైలాగ్ జగన్ రాజకీయ ఇమేజ్‌కు సినిమాటిక్ ఆకర్షణను జోడించింది. ఈ డైలాగ్ మొదట "యాత్ర" సినిమాలో వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి చెప్పగా, జగన్ తన పాదయాత్రలో దీనిని రాజకీయ నినాదంగా మార్చారు. ఈ డైలాగ్ 2022లో మహేష్ బాబు నటించిన "సర్కారు వారి పాట" సినిమాలో కూడా ఉపయోగించబడింది, దీనిపై వైఎస్ఆర్‌సీపీ మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు.కేటీఆర్ ఈ డైలాగ్‌ను ఉపయోగించడం ద్వారా, జగన్ యొక్క రాజకీయ, సాంస్కృతిక ప్రభావాన్ని తెలంగాణ సందర్భంలో ఉపయోగించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తుంది. ఈ డైలాగ్ యొక్క సినిమాటిక్, రాజకీయ నేపథ్యం దానిని సోషల్ మీడియాలో వైరల్‌గా మార్చడానికి దోహదపడింది. ఇక ఇప్పుడు ఎవరినీ వదిలి పెట్టం.. విదేశాల్లో ఉన్నా పట్టుకొస్తా.. అంటూ కేటీఆర్ జగన్ డైలాగులు చెబుతున్నారు.ఇప్పుడు నేతలు చెబుతున్న డైలాగులన్నీ అధికారులను బెదిరించేందుకే. కేసీఆర్ సర్కారే దీనికి మొదట తెరతీసింది. ఏపీలో జగన్ కూడా అధికారులను రాజకీయాలకు వాడుకున్నారు. అధికారం కోల్పోగానే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, టీడీపీ అదే పనిచేస్తున్నాయి. దీంతో ఇప్పుడు ప్రతిపక్ష నేతలు గగ్గోలు పెడుతున్నారు. అధికారులను తమ దారికి తెచ్చుకునేందుకే ఇలాంటి డైలాగులు కొడుతున్నారు.

## బిజినెస్

# అమెరికా వృద్ధికి ట్రంప్ దెబ్బ

### అదానీ ఎయిర్‌పోర్ట్స్ హెూల్డింగ్స్‌కు రూ. 6400 కోట్ల నిధులు




తదుపరి దశ విస్తరణ కోసం వివిధ అంతర్జాతీయ ఆర్థిక సంస్థల కన్సార్షియం నుంచి 75 కోట్ల డాలర్ల (రూ.6,400 కోట్లు) నిధులు సమీకరించినట్టు అదానీ ఎయిర్‌పోర్ట్స్ హెూల్డింగ్స్ లిమిటెడ్ (ఏఏహెచ్‌ఎల్) ప్రకటించింది. కన్సార్షియంలో ఫస్ట్ అబూ దబీ బ్యాంక్, బార్‌క్లేస్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకులున్నాయి. 40 కోట్ల డాలర్ల (రూ.3,400 కోట్లు) ప్రస్తుత రుణభారం తగ్గించుకోవడంతో పాటు విమానాశ్రయాల వ్యాపారం, ఈ వ్యాపారానికి అనుబంధంగా గల నాన్ ఏరో వ్యాపారాల విస్తరణకు ఈ నిధులు ఉపయోగించుకోనున్నట్టు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధానంగా అహ్మదాబాద్, లఖ్‌నవ్, మంగళూరు, జైపూర్, గువాహటి, తిరువనంతపురం విమానాశ్రయాలను విస్తరించనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం తమ నిర్వహణలోని విమానాశ్రయాల వార్షిక ప్రయాణికుల రవాణా సామర్థ్యం 9.4 కోట్లుండగా దాన్ని 11 కోట్లకు పెంచుతామని తెలియచేసింది. 2040 నాటికి దశలవారీగా ఈ సామర్థ్యాన్ని 30 కోట్లకు పెంచడం తమ లక్ష్యమని కంపెనీ సీఈఓ అరుణ్ బన్సల్ తెలిపారు. త్వరలోనే ప్రారంభం కానున్న నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం సామర్థ్యం తొలి దశలో రెండు కోట్లుంటుందని, దశలవారీగా దాన్ని 9 కోట్లకు చేర్చాలనుకుంటున్నామని ఆయన చెప్పారు.

### మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు



ఏప్రిల్ నెలలో ఏకంగా లక్ష దాటిన పసిడి ధరలు.. ఆ తర్వాత తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి.. ఇటీవల కాలంలో లక్ష నుంచి 95వేల వరకు దిగొచ్చిన పసిడి ధరలు.. ఆ తర్వాత కొన్ని రోజుల్లోనే 99 వేలు దాటింది. పసిడి, వెండికి ఎల్లప్పుడూ డిమాండే ఉంటుంది.. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కోసారి తగ్గితే.. మరికొన్ని సార్లు పెరుగుతూ వస్తుంటాయి.. అయితే.. ఇటీవల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా బంగారం ధరలు భారీగా పెరిగాయి.. ఏప్రిల్ నెలలో ఏకంగా లక్ష దాటిన పసిడి ధరలు.. ఆ తర్వాత తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి.. ఇటీవల కాలంలో లక్ష నుంచి 95వేల వరకు దిగొచ్చిన పసిడి ధరలు.. ఆ తర్వాత కొన్ని రోజుల్లోనే 99 వేలు దాటింది. ఈ క్రమంలోనే.. తాజాగా బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి.. జూన్ 05 2025 గురువారం ఉదయం వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర 99,180 ఉండగా.. 22 క్యారెట్ల ధర 90,910 గా ఉంది. 10గ్రాముల గోల్డ్ ధరపై రూ.10 మేర పెరిగింది. వెండి కిలో ధర రూ.100 పెరిగి.. రూ.1,02,100లుగా ఉంది.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.99,180గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.90,910 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,13,100లుగా ఉంది.విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,180 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.90,910లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,13,100 లుగా ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,330, 22 క్యారెట్ల ధర రూ.91,060 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,02,100లుగా ఉంది.ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.99,180, 22 క్యారెట్ల ధర రూ.90,910 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,02,100లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.99,180, 22 క్యారెట్ల ధర రూ.90,910 లుగా ఉంది. వెండి ధర కిలో రూ.1,13,100లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.99,180, 22 క్యారెట్ల ధర రూ.90,910 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,02,100 లుగా ఉంది.


అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆర్థిక విధానాలు ఆ దేశ వృద్ధితో పాటు ప్రపంచ జీడీపీపైనా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) వెల్లడించింది. ట్రంప్ టారిఫ్‌లతో ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక వృద్ధి నెమ్మదిస్తోందని ఓ రిపోర్ట్‌లో తెలిపింది. 2025లో అమెరికా ఆర్థిక వ్యవస్థ పెరుగుదల 1.6 శాతానికే పరిమితం కానుందని అంచనా వేసింది. 2026లో మరింత తగ్గి 1.5 శాతంగా ఉండొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం మార్చిలోని 2.2 శాతం వృద్ధి అంచనాలతో పోల్చితే ఇది చాలా తక్కువ కావడం విశేషం. 2025, 2026లో ప్రపంచ వృద్ధి రేటు 2.9 శాతానికి మందగించొచ్చని తెలిపింది. ఇంతక్రితం ఈ అంచనా వరుసగా 3.1 శాతం, 3 శాతంగా ఉంది. ముఖ్యంగా అమెరికా, కెనడా, మెక్సికో లాంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థలు నెమ్మదించడం ద్వారా గ్లోబల్ వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడనుంది. "ప్రపంచ దృక్పథం, భవిష్యతు మరింత సవాలుగా మారుతోంది. ప్రస్తుత హెచ్చు సుంకాల స్థాయిలు కొనసాగితే అవి వృద్ధి అవకాశాలను మరింత క్షీణింపజేస్తాయి. పెరుగుతున్న వాణిజ్య అడ్డంకులు, పడిపోతున్న వినిమయం, వ్యాపార విశ్వాసం, కఠినమైన ఆర్థిక పరిస్థితులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరింత భారాన్ని మోపనున్నాయి." అని ఓఈసీడీ పేర్కొంది. ఇటీవలి వారాల్లో అమెరికా వాణిజ్య



విధానంలో మరింత గందరగోళం చోటు చేసుకుంది. ఉక్కు సుంకాలను 50 శాతం రెట్టింపు చేయాలని ట్రంప్ నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేసింది. "యూఎస్ వాణిజ్య విధాన అనిశ్చితి తీవ్ర స్థాయికి చేరింది. దీంతో ప్రతీ దేశంపై ప్రభావం పడటంతో గ్లోబల్ వృద్ధి రేటు అంచనాలకు కోత పెట్టాం. ఇది బలహీనమైన పెట్టుబడి, వినియోగానికి దారితీసింది మొత్తం ఆర్థిక కార్యకలాపాల సూచికలు దెబ్బతిన్నాయి. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరుగుతున్నాయి." అని ఓఈసీడీ చీఫ్ ఎకనామిస్ట్ అల్వరో పెరియిరా పేర్కొన్నారు.

## మార్కెట్ కుప్పకూలడం ఖాయం..
# రాబర్ట్ కియోసాకి వార్నింగ్

రచయిత రాబర్ట్ కియోసాకి ఈ వేసవిలో "చరిత్రలో అతిపెద్ద మార్కెట్ క్రాష్" సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. స్టాక్‌లు, బాండ్లకు బదులుగా బంగారం, వెండి, బిట్‌కాయిన్ వంటి ప్రత్యామ్నాయ ఆస్తులలో పెట్టుబడి పెట్టాలని సూచించారు. సాంప్రదాయ ఆర్థిక వ్యవస్థ నుండి దూరంగా ఉండి, స్వావలంబన పొందడంపై ఆయన దృష్టి సారించారు. అత్యధికంగా అమ్ముడైన వ్యక్తిగత ఫైనాన్స్ పుస్తకం రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత రాబర్ట్ కియోసాకి "చరిత్రలో అతిపెద్ద మార్కెట్ క్రాష్" ఈ వేసవిలో ప్రారంభమవుతుందని హెచ్చరించారు. పెట్టుబడిదారులను స్టాక్‌లు, బాండ్ల నుండి బయటకు వెళ్లి బంగారం , వెండి, బిట్‌కాయిన్ వంటి ప్రత్యామ్నాయ ఆస్తులల్లో పెట్టుబడి పెట్టుకోవాలని కోరారు. ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ.. "నేను హెచ్చరించలేదని చెప్పకండి. నా పుస్తకం రిచ్ డాడ్స్ ప్రాఫసీ (2013)లో ఊహించినట్లుగా చరిత్రలో అతిపెద్ద క్రాష్ రాబోతోంది. క్రాష్ సమయం ఇప్పుడు, ఈ వేసవి అంతా ఉంటుందని నేను భయపడుతున్నాను." "స్టాక్, బాండ్ మార్కెట్లు కుప్పకూలినప్పుడు లక్షలాది మంది, ముఖ్యంగా నా




తరం బూమర్లు తుడిచిపెట్టుకుపోతారు" అని కియోసాకి హెచ్చరించారు. అదే సమయంలో "ముందుకు సాగే లక్షలాది మంది చాలా ధనవంతులు కావచ్చు, మీకు తెలిసినట్లుగా.. మీరు చాలా ధనవంతులు అయ్యే వారిలో ఒకరిగా ఉండాలని నేను కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. ఈ తిరోగమనం ఈక్విటీలు, బాండ్లకే పరిమితం కాదని కియోసాకి అన్నారు.

"ఈ వేసవిలో, స్టాక్, బాండ్, రియల్ ఎస్టేట్ మార్కెట్లు కుప్పకూలినప్పుడు.. బిలియన్ల మంది బంగారం, వెండి, బిట్‌కాయిన్‌ల వైపు చూస్తారు" అని ఆయన రాశారు. కాగితపు పెట్టుబడుల కంటే భౌతిక ఆస్తులకే తన ప్రాధాన్యతను పునరుద్ఘాటిస్తూ.. రేపు నేను నా స్థానిక బంగారం, వెండి డీలర్ వద్దకు వెళ్లి నిజమైన వెండిని కొనుగోలు చేస్తానని అన్నారు. కియోసాకి తన అనుచరులను తక్షణ చర్య తీసుకోవాలని కోరారు. "వెండి ధర ఔన్సుకు దాదాపు 35 డాలర్లుగా ఉంది, అంటే ప్రపంచంలో ఎక్కడైనా దాదాపు ప్రతి ఒక్కరూ.. ధనవంతులు అయ్యే అవకాశం ఉంది.. లక్షలాది మంది పేదలు అవుతారు." "రేపు మీరు ఏమి చేయబోతున్నారు.. ధనవంతులు అవుతారా లేదా పేదవారు అవుతారా? దయచేసి ధనవంతులు కావడానికి ఎంచుకోండి. జాగ్రత్తగా ఉండండి." అని అన్నారు. సాంప్రదాయ ఆర్థిక వ్యూహాల నుండి దూరంగా ఉండాలని పిలుపునిస్తూ, ఆస్తుల సేకరణ వ్యవస్థాపకత ద్వారా వ్యక్తులు స్వావలంబన పొందాలని ఆయన కోరారు.

## ఈసారీ రెండో రౌండ్‌లోనే..
# వరుసగా నిరాశపరుస్తున్న తెలుగుతేజం!

ఒలింపిక్ విజేత పీవీ సింధుకు మరోసారి నిరాశే మిగలింది. ఈ సీజన్‌లో ఒక్క టైటిల్ అయినా గెలవాలనే కసితో ఉన్న ఆమె మరోసారి రెండో రౌండ్ దాటలేకపోయింది. ఈమధ్యే మలేషియా మాస్టర్స్‌లో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత షట్లర్.. ఇండోనేషియా ఓపెన్‌లోనూ ఉసూరుమనిపించింది. గెలవాల్సిన మ్యాచ్‌లో పట్టుకోల్పోయి రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. తొలి రౌండ్‌లో చిరకాల ప్రత్యర్థి నొజొమి ఒకుహరకు చెక్ పెట్టిన సింధు.. రెండో రౌండ్‌లో అదే దూకుడును కనబరచలేకపోయింది. గురువారం ఉత్కంఠగా సాగిన పోరులో వరల్డ్ నంబర్ 8 పోర్న్పవీ చౌచువాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో సింధు కంగుతిన్నది. తొలి సెట్‌ను గెలుచుకున్న తర్వాత ప్రత్యర్థికి అవకాశం ఇచ్చి వెనకబడింది. 78 నిమిషాల పాటు సాగిన పోరులో 22-20, 1021, 18-21తో సింధు పరాజయం మూటగట్టుకుంది.

**సంతోషంగానే ఉన్నా..**

'నేను ఈ మ్యాచ్ కచ్చితంగా గెలవాలనుకున్నా. మూడో సెట్‌లో 16-13తో ఆధిక్యంలో ఉన్నా. కానీ, ఆ తర్వాత నియంత్రణ కోల్పోయాను. అక్కడి నుంచి పోర్న్పవీ దూకుడుగా ఆడి ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే.. 18 ఆల్ చేసి పోటీలోకి వచ్చాను. ఆ సమయంలో మ్యాచ్ ఎవరైనా



గెలిచే అవకాశముంది. మొత్తంగా నా ప్రదర్శన పట్ల సంతోషంగానే ఉన్నాను. ఈరోజు విజయం సాధించి ఉంటే బాగుండేది. ఈ ఓటమితో చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇక త్వరలో జరుగబోయే టోర్నమెంట్‌పై దృష్టి సారిస్తాను' అని మ్యాచ్ అనంతరం సింధు తెలిపింది.

# తొక్కిసలాట మృతులకు ఆర్థిక సాయం..

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటన నేపథ్యంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు నష్ట పరిహారం ప్రకటించింది. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా గాయపడిన వారి సహాయార్థం ఆర్‌సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. 'నిన్న బెంగళూరులో జరిగిన దురదృష్టకర ఘటన ఆర్‌సీబీ కుటుంబానికి తీవ్ర బాధను కలిగించింది. ఈ దుర్ఘటనలో మృతి చెందిన 11 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తాం. అంతేకాదు, గాయపడిన అభిమానులను ఆదుకునేందుకు ఆర్‌సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటు చేస్తాం' అని ఆర్‌సీబీ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం అందచేస్తామని కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. క్షతగాత్రులకు ఉచితంగా వైద్యం అందజేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బుధవారం వెల్లడించారు. పద్దెనిమిదేండ్ల నిరీక్షణ తర్వాత ఐపీఎల్ టైటిల్‌ని గెలుచుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టును సత్కరించేందుకు కాంగ్రెస్ సారథ్యంలోని కర్ణాటక ప్రభుత్వం బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తీవ్ర విషాదాంతమైన విషయం తెలిసిందే. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాట జరిగి 11 మంది మరణించగా, సుమారు 50





మంది గాయపడ్డారు. ఈ ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని, ముందు జాగత్తగా తగిన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఆరోపించింది. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమాన్ని వీక్షిం చేందుకు భారీ స్థాయిలో క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. పాసులు, టికెట్లు ఉన్న వారినే లోపలకు అనుమతించాల్సి ఉన్నప్పటికీ తమ ఆర్‌సీబీ హీరోలను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో స్టేడియం ప్రాంగణం ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది.

## స్పోర్ట్స్

### భారత్‌తో తొలి టెస్ట్ కోసం ఇంగ్లండ్ జట్టు ప్రకటన.. కీలక ఆటగాడు దూరం




జూన్ 20 నుంచి లీడ్స్ వేదికగా టీమిండియాతో జరుగబోయే తొలి టెస్ట్ కోసం 14 మంది సభ్యుల ఇంగ్లండ్ జట్టును ఇవాళ (జూన్ 5) ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా బెన్ స్టోక్స్ ఎంపిక? కాగా.. పేసర్ జేమీ ఓవర్టన్ దాదాపు మూడేళ్ల తర్వాత టెస్ట్ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఈ జట్టులో కీలక ఆటగాడు గస్ అట్కిన్సన్‌కు చోటు దక్కలేదు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన టెస్ట్ మ్యాచ్ సందర్భంగా అతను గాయపడ్డాడు. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న అట్కిన్సన్‌కు మూడు వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో అతను తదుపరి టెస్ట్‌లు ఆడేది కూడా అనుమానంగా మారింది. అట్కిన్సన్ స్థానాన్ని ఇంగ్లండ్ సెలెక్టర్లు ఓవర్టన్‌తో భర్తీ చేశారు. ఓవర్టన్ 2022 జూన్‌లో ఇంగ్లండ్ తరఫున తన చివరి టెస్ట్ మ్యాచ్ (న్యూజిలాండ్) ఆడాడు. గాయాల కారణంగా ఇటీవల జింబాబ్వేతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌కు దూరంగా ఉన్న పేసర్లు క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్ ఈ జట్టుకు ఎంపికయ్యారు. తాజాగా ముగిసిన ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ తరఫున రాణించిన జేకబ్ బేతెల్ కూడా ఈ జట్టులో చోటు దక్కించుకున్నాడు. భారత్‌తో తొలి టెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు: బెన్ స్టోక్స్ (కెప్టెన్), షోయబ్ బషీర్, జేకబ్ బేతెల్, హ్యారీ బ్రూక్, బ్రైడాన్ కార్స్, సామ్ కుక్, జాక్ క్రాలే, బెన్ డకెట్, జేమీ ఓవర్టన్, ఓలీ పోప్, జో రూట్, జేమీ స్మిత్, జోష్ టంగ్, క్రిస్ వోక్స్ కాగా, భారత క్రికెట్ జట్టు ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. జూన్ 20, జులై 2, 10, 23, 31 తేదీల్లో ఐదు టెస్ట్ మ్యాచ్‌లు లీడ్స్, బర్మింగ్హమ్, లార్డ్స్, మాంచెస్టర్, కెన్నింగ్‌స్టన్ ఓవల్ వేదికలుగా జరుగనున్నాయి. ఈ సిరీస్‌కు ముందు భారత్ జూన్ 13-16 మధ్యలో ఓ ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడనుంది. ఇంగ్లండ్ పర్యటనలో కోసం? భారత జట్టును ఇదివరకే ఎంపిక చేశారు. ఇంగ్లండ్ పర్యటన కోసం భారత టెస్ట్ జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ , వాషింగ్టన్ సుందర్, శార్దూల? ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్



# కమల్ 'కన్నడ' వివాదం..
# ఏది మాట్లాడినా వివాదమే

'తమిళ భాష నుంచే కన్నడ పుట్టింది' అని కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. మా భాషను తక్కువ చేసి మాట్లాడతావా? అని ఆయన నటించిన థగ్ లైఫ్ సినిమాపై కర్ణాటక ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) నిషేధం ప్రకటించింది. అప్పటికీ కమల్ వెనక్కుతగ్గలేదు. తన సినిమా కర్ణాటకలో రిలీజ్ చేయాలని కోర్టుకెళ్లాడు. అసలు ఏ ఆధారంతో అటువంటి కామెంట్లు చేశారు? సారీ చెప్తే అయిపోతుందిగా అని న్యాయస్థానం చీవాట్లు పెట్టింది.

ఏది మాట్లాడినా వివాదమే..

అప్పటికీ కమల్ క్షమాపణ చెప్పడం కాదుకదా.. అసలు కర్ణాటకలో సినిమా విడుదల చేయట్లేదని ప్రకటించాడు. తాజాగా ఈ వ్యవహారం హీరో రానా దగ్గుబాటికి వద్ద ప్రస్తావనకు వచ్చింది. రానా నాయుడు- రెండో సీజన్ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో కమల్- కన్నడిగుల మధ్య రాజుకున్న వివాదం గురించి రానా మాట్లాడుతూ.. అభిప్రాయాలు వ్యక్తం చేసే ప్లాట్‌ఫామ్‌గా సోషల్ మీడియా మారిపోయింది. మొదట్లో ఇలాంటి మాధ్యమాలన్నీ ఏం లేవు. ఇప్పుడు ఏది మాట్లాడినా వివాదాస్పదమవుతోంది. ప్రతీది రాజకీయం చేస్తున్నారు అన్నాడు. ఇకపోతే రానా దగ్గుబాటి, విక్టరీ వెంకటేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన రానా నాయుడు రెండో సీజన్ జూన్ 13 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది.

# సంక్రాంతి బరిలో మాస్ మహారాజా..

టాలీవుడ్‌లో సంక్రాంతి సినిమాలకు ఉండే క్రేజే వేరు. ఆ పండుగ వచ్చిందంటే చాలు.. రెండు తెలుగు రాష్ట్రాల్లో బాక్సాఫీస్ వద్ద తీవ్రమైన పోటీ ఉంటుంది. ఏడాది ముందు నుంచే పొంగల్‌కు చిత్రాలు రిలీజ్ చేయాలని ప్లాన్స్ వేసుకుంటూ ఉంటారు. ప్రధాన ఈ పండగకు స్టార్ హీరోల మధ్యే పోటీ ఉంటుంది. అయితే వచ్చే ఏడాది సంక్రాంతికి ఊహించని విధంగా నవీన్ పోలిశెట్టి బరిలో నిలిచాడు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఇప్పటికే చిరంజీవి విశ్వంభర బెర్త్ ఖాయం చేసుకోగా.. అనగనగా ఒక రాజు మూవీతో నవీన్ సైతం పోటీలోకి వచ్చేశాడు. ఈ చిత్రాన్ని డైరెక్టర్ మారి తెరకెక్కిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని టీమ్ ఇటీవల ప్రకటించింది. తాజాగా మరో స్టార్ హీరో సంక్రాంతికి సై అంటున్నారు. మాస్ మహారాజా రవితేజ పొంగల్ పోటీకి సిద్ధమయ్యారు. ఆయన కెరీర్‌లో నటిస్తోన్న 76వ చిత్రాన్ని ఇవాళ ప్రకటించారు. ఈ సినిమాకు తిరుమల కిశోర్ దర్శకత్వం వహించనున్నారు. ఈ మూవీని ఎస్ఎల్‌వీ బ్యానర్‌లో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను గురువారం పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ నిర్మాణ సంస్థ ట్వీట్ చేసింది. దీంతో పొంగల్ బాక్సాఫీస్ వద్ద భారీ పోటీ నెలకొంది.




# నా కన్నతల్లే నాకు కన్నప్ప..
## 'మై కన్నప్ప స్టోరీ' అంటూ మోహన్‌బాబు ప్రత్యేక వీడియో



మంచు విష్ణు కథానాయకుడిగా నటించిన కన్నప్ప చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌బాబుతో పాటు ప్రభాస్, అక్షయ్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. మంచు విష్ణు మీ లైఫ్‌లో కన్నప్ప ఎవరో అంటూ ఒక వీడియోను పంచుకోండి అంటూ అభిమానులను కోరాడు. ఇందులో భాగంగా తాజాగా మోహన్ బాబు ఒక వీడియోను పంచుకున్నాడు. నా లైఫ్‌లో కన్నప్ప మా అమ్మే అంటూ ఒక వీడియోను పంచుకున్నాడు. ఒక అమాయకుడు, ఆటవికుడైన తిన్నడు(కన్నప్ప).. పరమేశ్వరుడికి తన కళ్లు ఇచ్చి చరిత్రలో కన్నప్పగా మిగిలిపోయాడు. అలాగే మన ఆకలిని తెలుసుకుని మనకు అన్నం పెట్టేది అమ్మ. మనకు ఏది కావాలంటే అది వారి శక్తికి మించి అమ్మానాన్నలు మనకు ఇస్తారు. నా దృష్టిలో మా అమ్మానాన్నలు కన్నప్పలు అని మోహన్ బాబు అన్నారు. మా అమ్మ పేరు లక్ష్మమ్మ. దురదృష్టవశాత్తు ఆమెకు పుట్టుకతోనే రెండు చెవులు వినిపించేవి కాదు. ఆ మహాతల్లికి పరమేశ్వరుడు ఐదుగురు సంతానాన్ని ప్రసాదించాడు. ఒకచోట బస్సు దిగి మేము ఇంటికి వెళ్లాలంటే.. సుమారు ఏడు కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. ఆ దారి కూడా అంతంత మాత్రమే ఉండేది. మాది ద్వీపం లాంటి ఊరూ.. ఆ ఊరికి వెళ్లాలంటే.. ఒక కాలువ, సువర్ణముఖి నదిని దాటితేగాని ఊర్లోకి వెళ్లలేం. అలాంటి దారిలో చెవులు వినిపించని మా తల్లి ఐదుగురిని మోసుకుంటూ ఆ దారిలోనే ప్రయాణించేది. అది ఎంత కష్టమో ఒక్కసారి ఆలోచించండి. అప్పుడప్పుడు ఈ విషయాలు తలుచుకుంటూ బాధపడేవాడిని. నా కంఠం బాగుందని అందరూ మెచ్చుకున్నప్పుడు ఈ మాటలు నా తల్లికి వినిపిస్తే ఎంత బాగుండేది పరమేశ్వరా అని ఎన్నిసార్లు వేడుకున్నానో లెక్కలేదు. నా జీవితంలో నా తల్లే నాకు కన్నప్ప అంటూ మోహన్ బాబు ఎమోషనల్ అయ్యాడు.

# పెళ్లైన తగ్గేదే లే అంటున్న అక్కినేని కోడలు



తెలుగు రాష్ట్రాల నుండి ఎంతో మంది ముద్దుగుమ్మలు ఇండస్ట్రీకి వస్తున్నారు. కాని అందులో కొందరు మాత్రమే తమ టాలెంట్‌తో నిలబడుతున్నారు. వారిలో తెనాలి అమ్మాయి శోభిత ధూళిపాళ్ల కూడా ఒకరు. ఆరంభంలోనే అందాలతో మాయ చేసిన ఈ చిన్నది.. దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు అందిపుచ్చుకుంది. టీనేజ్‌లోనే మోడలింగ్ రంగంలోకి వెళ్లిన శోభిత 2013లో జరిగిన మిస్ ఇండియా అందాల పోటీల్లో పాల్గొని తృటిలో కిరీటాన్ని చేజార్చుకుంది. ఇక అదే ఏడాది మిస్ ఎర్త్ ఇండియా అందాల పోటీల్లోనూ కంటెస్టెంట్‌గా పాల్గొంది. దాంతో శోభితకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. 'రామన్ రాఘవ్ 2.0' అనే హిందీ చిత్రంతో నటిగా మారిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత 'చెఫ్', 'కళాకంది' వంటి బాలీవుడ్ చిత్రాలలో నటించింది. ఇక అడివి శేష్ 'గూఢచారి' మూవీతో శోభిత ధూళిపాళ్ల టాలీవుడ్‌లోకి వచ్చింది. ఈ సినిమాలో తన అందం, పర్‌ఫార్మెన్స్‌తో అదరగొట్టింది. ఈ సినిమా హిట్ అయిన శోభితకి తెలుగులో పెద్దగా అవకాశాలు రాలేదు. చాలా రోజుల తర్వాత 'మేజర్'తో తెలుగు చిత్రంలో కనిపించి మెప్పించిన కూడా..ఎందుకో ఈ అమ్మడికి అవకాశాలు ఇవ్వడం లేదు. శోభిత తన కెరీర్‌లో అదిరిపోయే హాట్ షో చేసింది. అలాగే, రొమాంటిక్ సీన్స్‌లోనూ నటించింది. 'మంకీ మ్యాన్' అనే హాలీవుడ్ మూవీలో ఈ చిన్నది వేశ్య పాత్రలో కనిపించింది. గ్లామర్ షోకు చిరునామాగా శోభిత ధూళిపాళ్ల ఎన్నో ఏళ్లుగా రచ్చ చేస్తుంది. అక్కినేని నాగ చైతన్యని వివాహం చేసుకొని అక్కినేని కోడలిగా మారాక కూడా శోభిత అందాలను ఆరబోస్తూ రచ్చ లేపుతోంది. ఇందులో భాగంగానే తనదైన గ్లామర్‌ను చూపిస్తూ తీసుకున్న హాట్ హాట్ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తోంది. తద్వారా ఈ బ్యూటీ తరచూ ట్రెండ్ అవుతూ నేషనల్ వైడ్‌గా హాట్ టాపిక్‌గా నిలుస్తూ ఉంటుంది. శోభిత ధూళిపాళ్ల తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో నైట్ వేర్ డ్రెస్ ధరించి రచ్చ లేపుతుంది. శోభిత షేర్ చేసిన ఫొటోలకు నెటిజన్ల నుంచి భారీ రెస్పాన్స్ వచ్చి పిక్స్ వైరల్‌గా మారుతున్నాయి.

# ట్రావెల్ థ్రిల్లర్‌తో వస్తున్న వడివేలు, ఫహాద్ ఫాసిల్..
## ఆకట్టుకుంటున్న 'మారీసన్' టీజర్



తమిళ హాస్యనటుడు వడివేలు మలయాళ స్టార్ హీరో ఫహాద్ ఫాసిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం మారీసన్ ట్రావెల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమాకు సుధీష్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా.. సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ ఆర్.బి. చౌదరి నిర్మిస్తున్నాడు. కోవై సరళ, వివేక్ ప్రసన్న, సితార, పిఎల్ తేనప్పన్, లివింగ్‌స్టన్, రేణుక, శరవణ సుబ్బయ్య, కృష్ణ, హరిత, టెలిఫోన్ రాజా తదితరులు ఇందులో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్‌ని 1957లో వచ్చిన క్లాసిక్ చిత్రం 'మాయాబజార్'లోని ఆహా ఇన్ప నిలావినిలే(లాహిరి లాహిరి లాహిరిలో) అనే పాటతో కట్ చేశారు మేకర్స్. టీజర్ చూస్తుంటే.. వడివేలు, ఫహాద్ ఫాసిల్ అనుకోకుండా బైక్‌పై ప్రయాణం చేస్తూ ఆ ప్రయాణంలో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. 'మామన్నన్' చిత్రం తర్వాత ఈ ఇద్దరు నటులు కలిసి నటిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు ప్రేక్షకులను ఆకట్టుకోగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.